JAYABHERIDAILY.COM
జాతీయ తెలుగు దినపత్రిక
ప్రభాత
# జయభేరి
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
మేడ్చల్ - మల్కాజిగిరి । గురువారం 22-01-2026
Medchal - Malkajgiri । Thursday 22-01-2026
Follow: jayabherinews
సంపుటి : 02 । సంచిక : 236
పేజీలు : 8 । వెల : 5
Vol. 02 । Issue 236 । Pages : 8 । ₹: 5

విలేకర్లు కావలెను
మీకు జర్నలిజంలో ఆసక్తి ఉందా?
సమస్యల్ని ప్రశ్నించేందుకు సరైన అస్త్రం కోసం ఎదురు చూస్తున్నారా?
మీకు అవకాశం కల్పించేందుకు మేము సిద్ధంగా ఉన్నాం..!
ప్రభుత్వానికి ప్రజలకి మధ్య వారధిగా ఉంటూ..
డిజిటల్ మీడియా రంగంలో సరికొత్త హంగులతో మీ అరచేతిలో...
"జయభేరి" తెలుగు దినపత్రిక.. నీకో చక్కని వేదికగా నిలుస్తుంది...
9391 544 889 call me
jayabheripaper@gmail.com



# గ్రీన్ లాండ్ ఎక్కడుంది?

- ట్రంప్ గ్రీన్‌లాండ్ కోసం ఎందుకు పట్టుబడుతున్నాడు?
- 1950ల్లో డెన్మార్క్, అమెరికా మధ్య సైనికపరమైన ఒప్పందం కుదిరింది
- అరుదైన ఖనిజాల కోసమేనా?
- గ్రీన్‌లాండ్ దేశంలో బంగారం, నికెల్, కోబాల్ట్ నిక్షేపాలు భారీ స్థాయిలో ఉన్నాయి

**జయభేరి, న్యూఢిల్లీ:**

గ్రీన్‌లాండ్‌ను త్వరలో స్వాధీనం చేసుకుంటామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. ఈరోజు కాకుంటే రేపైనా అది జరిగి తీరుతుందని పేర్కొన్నారు . ఈమేరకు ఆయన ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారు. అయితే అసలు గ్రీన్ లాండ్ ఎక్కడుంది? ఆ దేశం ఎందుకంత ప్రత్యేకం? ట్రంప్ ఆ దేశం కోసం ఎందుకు పట్టుబడుతున్నాడనే విషయం తెలుసుకుందాం!

**అసలేంటి గ్రీన్‌లాండ్**

గ్రీన్‌లాండ్ అనేది ప్రపంచంలోనే అతిపెద్ద ద్వీపం. సుమారుగా 80 శాతం మంచుతోనే ఉన్నటువంటి ఈ ప్రాంతంలో కేవలం 57వేల జనాభా మాత్రమే ఉన్నారు. భౌగోళికంగా అమెరికా దేశానికి చాలా దగ్గరగా ఉన్నప్పటికీ, ఇది డెన్మార్క్ దేశంలో భాగం. 1979లో జరిగిన రెఫరెండంలో ఈ ద్వీపానికి స్వయంప్రతిపత్తి లభించింది. భౌగోళికంగా ఈ ద్వీపం రష్యా, బ్రిటన్, అమెరికా,ఐరోపా యూనియన్ మధ్యలో ఉంది. కాబట్టి గ్రీన్‌లాండ్ ప్రాంతాన్ని అమెరికాకు చాలా కీలకమైన ప్రాంతంగా భావిస్తారు. డొనాల్డ్ ట్రంప్, గ్రీన్‌లాండ్ దేశాన్ని త్వరలో స్వాధీనం చేసుకుంటామని చెప్పడం, ప్రపంచవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ట్రంప్, ఆ ద్వీప ప్రాంతం కోసం ఎందుకు పట్టుబడుతున్నాడనే విషయం తెలుసుకుందాం! భద్రతా పరంగా గ్రీన్‌లాండ్ తమకు వ్యూహాత్మక ప్రాంతమని ట్రంప్ చెబుతున్నాడు. రక్షణ అవసరాల పరంగా ఆ ద్వీపం ఎప్పుడు అమెరికాకు అండానే నిలుస్తోంది. 1950ల్లో డెన్మార్క్, అమెరికా మధ్య

...మిగతాది 2 లో

# భారత్‌ను తక్కువ అంచనా వేయకండి

- అన్ని రంగాలలో AI అద్భుతమైన పురోగతిః అశ్విని వైష్ణవ్



2 లో

**జయభేరి, న్యూఢిల్లీ:**

భారతదేశం పూర్తి కృత్రిమ మేధస్సు (AI) పర్యావరణ వ్యవస్థపై పనిచేస్తోందని కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ప్రముఖ దేశాలలో ఒకటిగా ఉందని ఆయన అన్నారు.




# హైదరాబాద్ లో దావోస్ ఫాలో అప్

- ప్రతి సంవత్సరం జులైలో హైదరాబాద్ నగరంలో ఫాలోఅప్ సదస్సు
- భారత సీఈవోలకు ట్రంప్ విందు

**జయభేరి, హైదరాబాద్, జనవరి 21:**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఒక కీలక ప్రతిపాదన చేశారు. ప్రపంచ ఆర్థిక సదస్సు ఫాలోఅప్ సదస్సును ప్రతి సంవత్సరం తెలంగాణలో నిర్వహించాలని ఆయన సూచించారు. దావోస్‌లో జరుగుతున్న సదస్సులో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. ప్రతి సంవత్సరం జులైలో హైదరాబాద్ నగరంలో ఫాలోఅప్ సదస్సు నిర్వహించాలని ఆయన కోరారు. ముఖ్యమంత్రి ప్రతిపాదనకు ప్రముఖ వ్యాపారవేత్తలు, పాలసీ నిర్ణేతలు మద్దతు తెలిపారు. ఇదిలా ఉండగా, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో బ్లైజ్ కో ఫౌండర్ సీఈవో దినకర్ మునగాల సమావేశమయ్యారు. హైదరాబాద్ లో బ్లైజ్ ఆర్ అండ్ డీ సెంటర్ విస్తరణకు తెలంగాణ ప్రభుత్వంతో ఆయన ఎంవోయూ కుదుర్చుకున్నారు. దావోస్ ప్రపంచ ఆర్థిక సదస్సులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ లైఫ్ సైన్సెస్ పాలసీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

...మిగతాది 2 లో



# రేవంత్ పై కవిత సెటైర్లు

- ఈ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం
- ఇప్పటికీ కూడా ట్యాంక్ బండ్ పై మన తెలంగాణ వారి విగ్రహాలు లేవు

**జయభేరి, హైదరాబాద్, జనవరి 21 :**

మున్సిపల్ ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్ల అంశాన్ని పక్కదారి పట్టించేందుకే గుంపు మేస్త్రీ ,గుంటనక్క కలిసి ఫోన్ ట్యాపింగ్ డ్రామాలు ఆడుతున్నారని కవిత తీవ్రంగా విమర్శించారు. పట్టణాల్లో జరిగే ఈ ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్యాయం చేస్తోందని, దీనిపై ప్రధాన ప్రతిపక్షమైన బీఆర్ఎస్ ఎందుకు ప్రశ్నించడం లేదని ఆమె నిలదీశారు. ఈ రెండు పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయని, బాధితులకు ఈ విచారణల ద్వారా న్యాయం జరుగుతుందన్న నమ్మకం తనకు లేదని వ్యాఖ్యానించారు. తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మంత్రి ముచ్చర్ల సత్యనారాయణ జయంతి సందర్భంగా బంజారాహిల్స్‌లోని తెలంగాణ జాగృతి

...మిగతాది 2 లో




# చంద్రబాబు మిట్టల్ భేటీ..!

- అనకాపల్లిలో ముహూర్తం ఫిక్స్..!
- రూ. 60వేల కోట్లతో అర్సెల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇక్కడ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు
- ఫిబ్రవరి 15 తరవాత అనకాపల్లి జిల్లాలో ఆర్సెల్లార్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన

**జయభేరి, విజయవాడ, జనవరి 21 :**

దావోస్ లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన సీఎం చంద్రబాబు.. అక్కడ స్టీల్ దిగ్గజం లక్ష్మీ మిట్టల్ తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడుల కోసం వివిధ పారిశ్రామిక వేత్తలతో జరుగుతున్న భేటీలో భాగంగా మిట్టల్ తోనూ సమావేశమై పలు అంశాలు చర్చించారు. ఇందులో భాగంగా వీరిద్దరూ కలిసి ఓ కీలక నిర్ణయం తీసుకున్నారు. దీంతో ఏపీలోని అనకాపల్లికి మంచి రోజులు రాబోతున్నాయి. అర్సెల్లార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్ తో సీఎం చంద్రబాబు భేటీ అయి అనకాపల్లిలో నిర్మించనున్న భారీ స్టీల్ ప్లాంట్ పై చర్చించారు. దావోస్ లోని ఏపీ లాంజ్ లో జరిగిన ఈ భేటీలో ఆర్సెల్లార్ మిట్టల్ సంస్థ సీఈవో ఆదిత్య మిట్టల్,

...మిగతాది 2 లో

# బీజేపీలో యువతరం



2 లో



# దావోస్ లో చిరు

- 'ఇది గ్రేట్ మీట్' అంటూ నెటిజన్లు కామెంట్స్

**జయభేరి, హైదరాబాద్, జనవరి 21 :**

అంతర్జాతీయ వేదికపై అరుదైన దృశ్యం చోటు చేసుకుంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరుగుతున్న వరల్డ్ ఎకనామిక్ ఫోరం 2026 సదస్సులో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డితో పాటు మెగాస్టార్ చిరంజీవి పాల్గొన్నారు. ఆ దేశంలోనే జ్యూరిక్‌లో చిరు ఉన్నారని తెలుసుకున్న

...మిగతాది 2 లో

2 లో

# దళిత ఎమ్మెల్యేపై దాడా..?



▶▶ మొదటిపేజీ తరువాయి

## హైదరాబాద్ లో దావోస్ ఫాలో అప్

**భారత సీఈవోలకు ట్రంప్ విందు**

దావోస్ పర్యటనలో భాగంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఏర్పాటు చేయనున్న ప్రత్యేక విందుకు ఏడుగురు భారతీయ సీఈఓలకు ఆహ్వానం అందినట్లు సమాచారం. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో పాల్గొనేందుకు వివిధ దేశాధినేతలు, వ్యాపారవేత్తలు, రాజకీయ ప్రముఖులు తరలి వస్తున్నారు. ఆరేళ్ల తర్వాత అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఈ సదస్సులో పాల్గొననుండటం విశేషం. ప్రపంచ ఆర్థిక సదస్సులో ఆయన పాల్గొనడం ఇది మూడోసారి.ట్రంప్ ఏర్పాటు చేయనున్న ఈ విందుకు టాటా సన్స్ ఛైర్మన్ నటరాజన్ చంద్రశేఖరన్, భారతీ ఎంటర్‌ప్రైజెస్ ఛైర్మన్ సునీల్ మిట్టల్, విప్రో సీఈఓ శ్రీని పల్లియా, ఇన్ఫోసిస్ సీఈఓ సలీల్ పరేఖ్, బజాజ్ ఫిన్ సర్వ్ సీఎండీ సంజీవ్ బజాజ్, మహీంద్రా గ్రూపు సీఈఓ అనీశ్ షా, జుబిలెంట్ భర్తియా గ్రూప్ సహ వ్యవస్థాపకుడు హరి భర్తియాలు హాజరయ్యే అవకాశం ఉంది. ప్రపంచ ఆర్థిక సదస్సుకు 130 దేశాల నుంచి 3 వేలకు పైగా ప్రతినిధులు హాజరు కానున్నారు.

## గ్రీన్ లాండ్ ఎక్కడుంది?

సైనికపరమైన ఒప్పందం కుదిరింది. దీని వలన ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో అమెరికా, గ్రీన్‌లాండ్‌లో సైనిక స్థావరాలను నిర్మించింది.

**అరుదైన ఖనిజాల కోసమేనా?**

ఇటీవల వెనెజువెలా అధ్యక్షుడు ముదురో నిర్బంధానికి ఆ దేశంలో ఉన్న చమురు నిక్షేపాలే కారణమని విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గ్రీన్‌లాండ్ విషయంలోని అదే జరగనుందా? అని పలువురు నిపుణులు అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఆ దేశంలో దొరికే అరుదైన ఖనిజాల కోసం ట్రంప్ ప్రయత్నిస్తున్నారని పలువురు సందేహం వ్యక్తం చేస్తున్నారు. గ్రీన్‌లాండ్ దేశంలో బంగారం, నికెల్, కోబాల్ట్ నిక్షేపాలు భారీ స్థాయిలో ఉన్నాయి. వీటి కోసమే ట్రంప్ ప్రయత్నిస్తున్నాడని పలువురు విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దావోస్ వేదికగా గ్రీన్‌లాండ్ విషయంలో ట్రంప్ మరోసారి వ్యాఖ్యలు చేశారు. గ్రీన్‌లాండ్ భూభాగాన్ని డెన్మార్క్ కాపాడలేదని, ఒక్క అమెరికా మాత్రమే గ్రీన్‌లాండ్‌ను రక్షించగలరని తెలిపారు. జనవరి 21న వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సులో పాల్గొన్న ట్రంప్ గ్రీన్ లాండ్ విషయంలో ఈ వ్యాఖ్యలు చేశారు. గ్రీన్ లాండ్, డెన్మార్క్‌లపై గొప్ప గౌరవం ఉందని తెలిపారు. గ్రీన్‌లాండ్ అమెరికా భద్రతకు అలాగే అంతర్జాతీయ భద్రతకు ఎంతో కీలకమని తెలిపారు.

## రేవంత్ పై కవిత సెటైర్లు

కార్యాలయంలో కల్వకుంట్ల కవిత ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ముచ్చర్ల సత్యనారాయణ విగ్రహాన్ని ట్యాంక్ బండ్ వద్ద ప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికీ కూడా ట్యాంక్ బండ్ పై మన తెలంగాణ వారి విగ్రహాలు లేవు. ఆంధ్రా నాయకుల విగ్రహాలు తీసేయమనటం లేదు. అవసరమైన నాడు తప్పకుండా తీసేద్దాం. కానీ మన తెలంగాణ వారి విగ్రహాలు కచ్చితంగా ట్యాంక్ బండ్ పై ఉండాలన్నారు. తెలంగాణ కోసం పోరాడిన ఎందరో అన్‌సంగ్ హీరోల త్యాగాలను భవిష్యత్ తరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని, తాము అధికారంలోకి వస్తే అమరవీరుడు శ్రీకాంతా చారి జయంతి, వర్ధంతులను అధికారికంగా నిర్వహిస్తామని ఆమె స్పష్టం చేశారు. రాష్ట్రంలో జరిగిన కులగణనలో బీసీల సంఖ్యను తక్కువగా చూపి కాంగ్రెస్ మోసానికి పాల్పడిందని, కేంద్రం చేపట్టబోయే కులగణన ద్వారా ఆ మోసాన్ని బయటపెట్టే అవకాశం వచ్చిందని కవిత పేర్కొన్నారు. బీసీ ఉపకులాలకు అన్యాయం జరగకుండా ప్రతి కులానికి సంబంధించిన సమగ్ర సమాచారాన్ని తెలంగాణ జాగృతి సేకరిస్తుందని, దీనిపై త్వరలోనే మేధావులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని వెల్లడించారు. బీసీలు, ఎస్సీ, ఎస్టీ, మహిళలు మరియు యువత రాజకీయాల్లోకి రావాలని, వారికి జాగృతి తరపున పూర్తి మద్దతు ఇస్తామని ఆమె పిలుపునిచ్చారు. సికింద్రాబాద్ జిల్లా ఏర్పాటు డిమాండ్‌పై స్పందిస్తూ, గత పదేళ్లుగా ఈ డిమాండ్‌ను అణిచివేసిన కేటీఆర్, ఇప్పుడు దాని గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. జిల్లాల పునర్విభజన జరిగినప్పుడు సికింద్రాబాద్‌ను జిల్లాగా చేయడంతో పాటు, ప్రొఫెసర్ జయశంకర్ గారి పేరును ఒక జిల్లాకు పెట్టాలని డిమాండ్ చేశారు. తెలంగాణ జాగృతి రాజకీయ పార్టీగా ఇంకా పూర్తిస్థాయిలో అవతరించకపోయినప్పటికీ, తెలంగాణ ప్రయోజనాల కోసం పోరాడే వారికి అండగా ఉంటామని కవిత స్పష్టం చేశారు.

## భారత్‌ను తక్కువ.. వేయకండి

స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన వరల్డ్ ఎకనామిక్ ఫోరంలో జరిగిన చర్చ సందర్భంగా, IMF మేనేజింగ్ డైరెక్టర్ క్రిస్టాలినా జార్జివా AI కోసం దేశాల సంసిద్ధత, కొత్త సూచికను విడుదల చేశారు. ఈ సందర్భంగా ప్రపంచ దేశాలను మూడు వర్గాలుగా విభజించారు. పరివర్తనకు నాయకత్వం వహించేవి, కేవలం గమనిస్తున్నవి. పరివర్తన గురించి తెలియనివి. US, డెన్మార్క్, సింగపూర్ ఈ జాబితాలో అగ్రస్థానంలో ఉండగా, సౌదీ అరేబియా వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్లతో పాటు భారతదేశం రెండవ స్థానంలో నిలిచింది. ఐటీ రంగంలో భారతదేశంలో పెరుగుతున్న పెట్టుబడులను ప్రశంసించినప్పటికీ, దానిని అగ్ర సమూహంలో చేర్చలేదు. అయితే సందర్భంగా కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ IMF ర్యాంకింగ్స్‌ను పూర్తిగా తిరస్కరించారు. భారతదేశం రెండవది కాదని, మొదటి గ్రూపులోనే ఉందని ఆయన నమ్మకంగా పేర్కొన్నారు. AI ప్రపంచంలో అగ్రగామి దేశాలలో భారతదేశం మొదటి గ్రూపులో ఉందని, భారత దేశాన్ని తక్కువ అంచనా వేయకూడదని వైష్ణవ్ స్పష్టం చేశారు. భారతదేశ వ్యూహాన్ని వివరిస్తూ, దేశం ఐదు ప్రధాన AI నిర్మాణ పొరలపై ఏకకాలంలో పనిచేస్తోందని మంత్రి అన్నారు. అప్లికేషన్, మోడల్, చిప్, మౌలిక సదుపాయాలు, శక్తి. ఈ అన్ని రంగాలలో భారతదేశం అద్భుతమైన పురోగతిని సాధిస్తోందని, ఇది కేవలం ఒక స్థాయికి పరిమితం కాదని ఆయన అన్నారు. భారతదేశం ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థగా అభివర్ణించిన వైష్ణవ్, మన AI సామర్థ్యాలు దేశ ఆర్థిక భవిష్యత్తును మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. భారీ మోడల్స్ కాదు, టెక్నాలజీ ఆచరణాత్మక వైపు పరుగెడుతోందన్నారు కేంద్ర మంత్రి. భారతదేశం నిజమైన ప్రయోజనం AI సరైన ఉపయోగంలో ఉందని అశ్విని వైష్ణవ్ అన్నారు. పెద్ద AI మోడల్‌లను నిర్మించడం ద్వారా లాభాలు సాధ్యం కాదని, వ్యాపార, రోజువారీ సమస్యలను పరిష్కరించడానికి వాటిని వర్తింపజేయడం ద్వారా మాత్రమే సాధించవచ్చని ఆయన స్పష్టం చేశారు. వ్యవసాయం, ఆరోగ్యం, విద్య వంటి రంగాలలో ఉత్పాదకతను పెంచడానికి ఇప్పటికే అమలు అవుతున్న 20 నుండి 50 బిలియన్ పారామితులతో కూడిన తెలివైన నమూనాల సమగ్ర సూట్‌ను భారతదేశం అభివృద్ధి చేస్తోందని కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పష్టం చేశారు. AI అడిగినప్పుడు దురుసుగా, తీపిగా కాకుండా ఖచ్చితమైన సమాధానాలను ఇస్తుంది. ChatGPT భారతదేశం తన స్వంత మార్గాన్ని ఏర్పరుచుకుంటుందని బహిర్గతం చేస్తుంది. స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం నుండి డేటాను ప్రస్తావిస్తూ కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ IMF మూల్యాంకన పద్ధతులను ప్రశ్నించారు. భారతదేశం ఇతరులను అనుసరించడం కంటే AI రంగంలో తన స్వంత స్వతంత్ర మార్గాన్ని ఏర్పరుచుకుంటోందని అశ్విని వైష్ణవ్ తెలిపారు. AI వ్యాప్తిలో భారతదేశం ప్రపంచంలో మూడవ స్థానంలో ఉందని, AI ప్రతిభ పరంగా రెండవ స్థానంలో ఉందని ఆయన పేర్కొన్నారు. వచ్చే నెలలో భారతదేశంలో ఒక ప్రధాన AI శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఇక్కడ భారతదేశం AI రంగంలో సమగ్ర, సురక్షితమైన సాంకేతికతలను ప్రదర్శిస్తుంది. భారతదేశం, అమెరికా — చైనా కంటే వెనుకబడి ఉండటానికి బదులుగా, ప్రపంచ AI చర్చలో కొత్త శక్తిగా ఎదగడానికి సిద్ధంగా ఉందని స్పష్టమైన సంకేతం ఇచ్చారు కేంద్ర ఐటీ మంత్రి అశ్విని వైష్ణవ్.

# బీజేపీలో యువతరం...



భారతీయ జనతా పార్టీలో తరాల మార్పు మొదలైంది. కొంతకాలంగా వినిపిస్తున్న ఊహాగానాలకు తెరదించుతూ, బీజేపీ జాతీయ సారథ్య బాధ్యతలను యువ నాయకుడు నితిన్ నబిన్‌కు అప్పగించడం భారత రాజకీయాల్లో పెను సంచలనంగా మారింది. కేవలం 45 ఏళ్ల వయసులో ప్రపంచంలోనే అతి పెద్ద రాజకీయ పార్టీకి అధ్యక్షుడవ్వడం అంటే అది సామాన్య విషయం కాదు. ఇది కేవలం ఒక నియామకం మాత్రమే కాదు, రాబోయే రెండు దశాబ్దాల రాజకీయాలను శాసించేలా మోదీషా ద్వయం రచించిన ఒక పకడ్బందీ వ్యూహం అని చెప్పొచ్చు. నితిన్ నబిన్ ఎదుగుదల వెనుక వారసత్వ రాజకీయాల నీడ లేదు.. కేవలం కఠోర శ్రమ, అంకితభావం మాత్రమే ఉన్నాయి. ఆయన రాజకీయ ప్రస్థానం బీహార్ గల్లీల నుండి మొదలైంది. భారతీయ జనతా యువమోర్చా జాతీయ ప్రధాన కార్యదర్శిగా, బీహార్ యువమోర్చా అధ్యక్షుడిగా ఆయన పార్టీ క్యాడర్‌ను కింది స్థాయి నుండి నిర్మించారు. 2006లో మొదటిసారి ఎమ్మెల్యేగా గెలిచిన నితిన్, అప్పటి నుండి వెనుదిరిగి చూడలేదు. పాట్నాలోని బంకీపూర్ నియోజకవర్గం నుంచి వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందడం ఆయన ప్రజాదరణకు నిదర్శనం. బీహార్ ప్రభుత్వంలో రోడ్లు, న్యాయశాఖ, పట్టణాభివృద్ధి వంటి కీలక శాఖల మంత్రిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉంది. కేవలం పార్టీని నడపడమే కాకుండా, ప్రభుత్వాన్ని ఎలా నడపాలో కూడా తెలిసిన నాయకుడు కావడంతో అధిష్టానం ఆయన వైపు మొగ్గు చూపింది.

బీజేపీలో ఎంతోమంది సీనియర్లు, హేమాహేమీలు ఉన్నప్పటికీ నితిన్ నబిన్ వైపే మొగ్గు చూపడానికి ప్రధాన కారణం ఆయనకున్న 'సమన్వయ కర్త' అనే ఇమేజ్. మోదీషాల వ్యూహాలను తు.చ. తప్పకుండా అమలు చేయడంలో ఆయన దిట్ట. పార్టీ గీసిన గీతను దాటకుండా, అందరినీ కలుపుకుపోవడం ఆయన ప్రత్యేకత. ఆయన కాయస్థ సామాజిక వర్గానికి చెందినవారు. ఇది రాజకీయంగా తటస్థ వర్గంగా పరిగణించబడుతుంది. ఏ ఇతర బలమైన కుల వర్గాలతోనూ ఘర్షణ లేని నేపథ్యం కావడం వల్ల, దేశవ్యాప్తంగా ఉన్న వివిధ కుల సమీకరణాలను సమన్వయం చేయడం ఆయనకు సులభమవుతుంది. కాంగ్రెస్ పార్టీ 80 ఏళ్లు పైబడిన సీనియర్ నేత మల్లికార్జున ఖర్గే సారథ్యంలో నడుస్తుంటే, బీజేపీ 45 ఏళ్ల యువకుడిని తెరపైకి తెచ్చి దేశ యువతకు ఒక బలమైన సంకేతాన్ని పంపింది. నితిన్ నబిన్ సామర్థ్యంపై అధిష్టానానికి పూర్తి నమ్మకం కలిగించింది 2023 ఛత్తీస్‌గఢ్ ఎన్నికలే. అప్పట్లో అక్కడ కాంగ్రెస్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ తిరుగులేని శక్తిగా ఉండేవారు. సర్వేలన్నీ బీజేపీ ఓడిపోతుందని చెప్పాయి. ఆ క్లిష్ట సమయంలో పార్టీ ఇన్‌చార్జ్‌గా వెళ్లిన నబిన్, తన మైక్రో మేనేజ్‌మెంట్ వ్యూహంతో అద్భుతం చేశారు. గ్రౌండ్ లెవల్‌లో బూత్ కమిటీలను బలోపేతం చేసి, కాంగ్రెస్ కోటను బద్దలు కొట్టి బీజేపీని అధికారంలోకి తెచ్చారు. ఇటీవల ఢిల్లీలో బీజేపీ తిరిగి తన ఉనికిని చాటుకోవడంలో కూడా ఆయన కీలక పాత్ర పోషించారు. కష్టమైన టాస్క్‌లను సైతం సైలెంట్‌గా పూర్తి చేసే 'ట్రబుల్ షూటర్'గా ఆయన పేరు తెచ్చుకున్నారు. నితిన్ నబిన్ ముందు ఇప్పుడు పూలపాన్పు లేదు, ముళ్ల బాట ఉంది. బీజేపీకి ఇప్పటికీ సవాల్‌గా ఉన్న దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీని విస్తరించడం ఆయన ప్రాథమిక లక్ష్యం. త్వరలో జరగబోయే బెంగాల్, ఉత్తర ప్రదేశ్, అస్సాం ఎన్నికల్లో పార్టీ విజయం సాధించడం ఆయన సారథ్యానికి పరీక్షగా నిలవనుంది.

2029 సార్వత్రిక ఎన్నికల నాటికి దేశంలో కొత్తగా చేరే కోట్లాది మంది యువ ఓటర్లను బీజేపీ వైపు తిప్పుకోవడం కోసం ఆయన తనదైన శైలిలో పార్టీని డిజిటల్, క్షేత్రస్థాయిలో ఆధునీకరించాల్సి ఉంది. తిన్ నబిన్ 1980 మే 23న జార్ఖండ్‌లోని రాంచీలో జన్మించారు. ఆయన తండ్రి నబిన్ కిశోర్ ప్రసాద్ సిన్హా, తల్లి మీరా సిన్హా. కిశోర్ సిన్హా సీనియర్ బీజేపీ నాయకుడు. ఆయన పాట్నా వెస్ట్ నియోజకవర్గం నుంచి నాలుగు సార్లు బీహార్ శాసనసభ సభ్యుడిగా ఎన్నికయ్యారు. కాగా, నితిన్ నబిన్ 1996లో పాట్నాలోని సెయింట్ మైఖేల్స్ హై స్కూల్ నుంచి పదో తరగతి పరీక్షలో పాసయ్యారు. ఆ తర్వాత ఢిల్లీలోని సీఎస్‌కేఎం పబ్లిక్ స్కూల్ నుంచి 1998లో ఇంటర్మీడియట్ పూర్తి చేశారు. నితిన్ నబిన్.. దీప్‌మాలా శ్రీవాస్తవను వివాహం చేసుకున్నారు. ఈ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఇదిలా ఉండగా.. నితిన్ నబిన్ రాజకీయ ప్రస్థానం 2006 ప్రారంభమైంది. పాట్నా వెస్ట్ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికలో గెలిచి.. రాజకీయాల్లోకి ప్రవేశించారు నితిన్. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత.. ఆయన బాంకిపూర్‌కు మారారు.

అప్పటి నుంచి 2010, 2015, 2020, 2025 అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయం సాధిస్తూ.. తన కంచుకోటను కాపాడుకున్నారు. నితీష్‌కుమార్ నేతృత్వంలోని బీహార్ ప్రభుత్వంలో కూడా నితిన్ నబిన్ కీలక పదవుల్లో పనిచేశారు. 2021 ఫిబ్రవరి నుంచి 2022 ఆగస్టు వరకు రహదారుల నిర్మాణ శాఖ మంత్రిగా పనిచేశారు. 2025 ఫిబ్రవరి నుంచి 2025 డిసెంబర్ వరకు తిరిగి అదే శాఖ బాధ్యతలను చేపట్టారు. ఇక 2024 మార్చి 2025 ఫిబ్రవరి మధ్య.. ఆయన పట్టణాభివృద్ధి, గృహనిర్మాణ శాఖతో పాటు న్యాయ మంత్రిత్వ శాఖను కూడా నిర్వహించారు.

ఆయన మంత్రిగా ఉన్న కాలంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి, పట్టణ గృహనిర్మాణ కార్యక్రమాలు, సంక్షేమ చర్యలపై దృష్టి సారించారు. బీజేపీ యువ విభాగం నుంచి వచ్చిన నబిన్.. సంస్థాగతంగా పార్టీ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారు. గతంలో నితిన్ బీజేపీ యువ మోర్చా (బీజేవైఎం) జాతీయ ప్రధాన కార్యదర్శిగా, బీజేవైఎం బీహార్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. ఇదే సమయంలో జమ్మూకాశ్మీర్‌లో జరిగిన జాతీయ ఐక్యతా యాత్ర, 1965 యుద్ధంలో వీరమరణం పొందిన అమరవీరులకు నివాళులర్పిస్తూ గౌహతి నుంచి తవాంగ్ వరకు నిర్వహించిన పాదయాత్ర సహా అనేక పార్టీ ప్రచార కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారు. మరోవైపు, బీజేపీ సిక్కిం ఇంచార్జిగా, ఛత్తీస్‌గఢ్ కో ఇంచార్జిగా నితిన్ నబిన్ పనిచేశారు. ఆయా రాష్ట్రాల్లో పార్టీ బలోపేతంలో కీలక పాత్ర పోషించారు.

2025 డిసెంబర్‌లో బీజేపీ పార్లమెంటరీ బోర్డు.. ఆయన్ను పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియమించింది. మొత్తానికి, నితిన్ నబిన్ నియామకంతో బీజేపీ ఒక కొత్త శకానికి నాంది పలికింది. అమిత్ షా చాణక్యం, మోదీ చరిష్మాకు నితిన్ నబిన్ యువశక్తి తోడైతే.. రాబోయే ఎన్నికల్లో బీజేపీ దూసుకుపోవడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇది కేవలం పార్టీ అధ్యక్ష పదవి మార్పు కాదు, 2029లో సరికొత్త రికార్డులను సృష్టించేందుకు వేసిన 'మాస్టర్ ప్లాన్'.

## చంద్రబాబు మిట్టల్ భేటీ..!

మంత్రులు లోకేష్, టీజీ భరత్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లాలో నిర్మించనున్న అర్సెల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ పురోగతిపై వీరు చర్చించారు. తొలి దశలోనే దాదాపు రూ. 60వేల కోట్లతో అర్సెల్లార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ఇక్కడ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు వివిధ దశల్లో ఉన్న అనుమతులపై లక్ష్మీ మిట్టల్ సమక్షంలో అధికారులతో సీఎం సమీక్షించారు. అనంతరం ఫిబ్రవరి 15లోగా అనుమతులు, భూసేకరణ అంశాలు పూర్తి చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశాలు ఇచ్చారు. ఫిబ్రవరి 15 తరవాత అనకాపల్లి జిల్లాలో ఆర్సెల్లార్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ ఉక్కు పరిశ్రమకు శంకుస్థాపన చేయాలని నిర్ణయించారు. సాధ్యమైనంత త్వరగా స్టీల్ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేసుకుని ఉత్పత్తి ప్రారంభించాలని సీఎం తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు, ఇతర సహకారం విషయంలో ఎక్కడా జాప్యం ఉండదని స్పష్టం చేశారు. అవసరమైతే ఢిల్లీ వెళ్లి కేంద్రం నుంచి త్వరితగతిన అవసరమైన అన్ని అనుమతుల సాధించాలని మంత్రులు లోకేష్, టీజీ భరత్ లకు సీఎం సూచన చేశారు. ప్లాంట్ నిర్మాణం విషయంలో మంత్రి లోకేష్ నిరంతరం పర్యవేక్షిస్తున్నారని ఆదిత్య మిట్టల్ తెలిపారు. రాష్ట్రంలో వివిధ రంగాల్లో పెట్టుబడులు, పరిశ్రమల ఏర్పాటు గురించి లక్ష్మీ మిట్టల్ కు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

## దావోస్ లో చిరు

సీఎం రేవంత్ ఆయన్ను స్వయంగా సదస్సుకు రావాలని ఆహ్వానించారు. దీంతో మెగాస్టార్ హాజరయ్యారు. వేదికపై తెలంగాణ రైజింగ్ 2047 విజన్ డాక్యుమెంట్‌ను ఆయన వీక్షించారు. ప్రపంచ వేదికపై తెలంగాణ దృక్పథాన్ని, విజన్‌ను ఈ డాక్యుమెంట్ ఆవిష్కరించింది. ఈ సందర్భంగా మెగాస్టార్ చిరంజీవితో రేవంత్ సరదాగా ముచ్చటించారు. సంక్రాంతికి రిలీజైన 'మన శంకరవరప్రసాద్ గారు' మూవీని... తన ఫ్యామిలీ మెంబర్స్, మనవళ్లతో కలిసి ఎంజాయ్ చేసినట్లు వివరించారు. సినిమా హిట్ కావడంపై చిరంజీవికి అభినందనలు తెలిపారు. చిరు తన ఫ్యామిలీతో కలిసి స్విట్జర్లాండ్ విహార యాత్రకు వెళ్లారు. ఇదే సమయంలో దావోస్‌లో ప్రపంచ ఆర్థిక సదస్సు జరుగుతుండడంతో సీఎం రేవంత్ అక్కడకు వెళ్లారు. చిరు సైతం అక్కడే ఉన్నారని తెలిసి వారిని స్వయంగా ఆహ్వానించారు. ప్రస్తుతం ఇద్దరూ కలిసి ఉన్న ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. 'ఇది గ్రేట్ మీట్' అంటూ నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. మరోవైపు, అంతర్జాతీయ ప్రముఖ కంపెనీల పెట్టుబడుల సాధనే లక్ష్యంగా తెలుగు రాష్ట్రాల సీఎంలు దావోస్ సదస్సుకు వెళ్లారు.

# దళిత ఎమ్మెల్యేపై దాడా..

**జయభేరి, హైదరాబాద్, జనవరి 21 :**

బీఆర్ఎస్ నాయకుడు, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడిపై కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి దుర్భాషలాడుతూ చేయి చేసుకోవడంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ (KTR) తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనను ప్రజాస్వామ్యంపై జరిగిన బహిరంగ దాడిగా ఆయన అభివర్ణించారు. ప్రతిపక్ష నేతలను భయపెట్టేందుకు, వారి గొంతు నొక్కేందుకు కాంగ్రెస్ నాయకులు ఇంతలా దిగజారి రాజకీయాలు చేయడం అత్యంత విచారకరమని విమర్శించారు ప్రజల చేత ఎన్నికైన ఒక ఎమ్మెల్యేను అవమానిస్తూ, భైతిక దాడికి దిగడం కాంగ్రెస్ పార్టీ దిగజారిన సంస్కృతికి నిదర్శనమని కేటీఆర్ మండిపడ్డారు. చట్టం, రాజ్యాంగం, ప్రజాస్వామ్య విలువలపై కాంగ్రెస్‌కు ఏమాత్రం గౌరవం లేదని ఈ ఘటన మరోసారి నిరూపించిందని అన్నారు. ఇలాంటి భౌతిక దాడుల ద్వారా ప్రతిపక్షాన్ని అణిచివేయలేరని కేటీఆర్ స్పష్టం చేశారు ఈ దాడిని బీఆర్ఎస్ పార్టీ తరపున తీవ్రంగా ఖండించిన కేటీఆర్, ఎంపీ మల్లు రవి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ ఘటనకు నైతిక బాధ్యత వహించి, సంబంధిత నేతలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రతిపక్షాన్ని బెదిరింపులతో కాకుండా ప్రజా తీర్పుతో ఎదుర్కోవాలని హితవు పలికారు. తమ పార్టీ నేతలపై ఇలాంటి దాడులు చేస్తే చూస్తూ ఊరుకోమని, ప్రజాస్వామ్య పద్ధతిలోనే గట్టిగా ఎదుర్కొంటామని కేటీఆర్ హెచ్చరించారు. అసలేం జరిగింది.. భూమిపూజ కార్యక్రమంలో మల్లు రవి, ఎమ్మెల్యే విజయుడు మధ్య తోపులాట చోటుచేసుకుంది. వడ్డేపల్లి మునిసిపాలిటీలోని పైపాడులో మంగళవారం సీసీ రోడ్లు, మురుగు కాలువల నిర్మాణం భూమి పూజకు నేతలు హాజరయ్యారు. ఎమ్మెల్యే విజయుడు కొబ్బరికాయ కొట్టిన అనంతరం ఎంపీ మల్లురవి కొబ్బరికాయ కొట్టాల్సిన సమయంలో సంచిని బీఆర్ఎస్ కార్యకర్తలు పక్కకు లాగడంతో వివాదం మొదలై తోపులాట చోటుచేసుకుంది. ఎమ్మెల్యే, ఎంపీ బాహాబాహీకి దిగడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. గద్వాల జిల్లా అలంపూర్ నియోజకవర్గంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో కాంగ్రెస్ ఎంపీ మల్లు రవి, అలంపూర్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే విజయుడి మధ్య తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో ఎంపీ మల్లు రవి సహనం కోల్పోయి ఎమ్మెల్యేపై దుర్భాషలాడుతూ, భౌతిక దాడికి దిగారని బీఆర్ఎస్ శ్రేణులు ఆరోపిస్తున్నాయి. బహిరంగంగానే ఒక ప్రజా ప్రతినిధిపై మరో



ప్రజా ప్రతినిధి చేయి చేసుకోవడం రాష్ట్ర రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు భగ్గుమన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ తీరుకు వ్యతిరేకంగా నిరసనలు చేపట్టారు. ప్రతిపక్ష పార్టీల గొంతు నొక్కేందుకే కాంగ్రెస్ ఇలాంటి భౌతిక దాడులకు ప్రోత్సహిస్తోందని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ఎంపీ మల్లు రవి తక్షణమే బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మరోవైపు, కాంగ్రెస్ వర్గాలు ఈ ఆరోపణలను తోసిపుచ్చుతున్నాయి. కేవలం వాగ్వాదం మాత్రమే జరిగిందని, దాడి జరగలేదని సమర్థించుకునే ప్రయత్నం చేస్తున్నాయి. అయితే, ఈ ఘటనకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ కావడంతో పోలీసులు కూడా ప్రాథమిక విచారణ చేపట్టినట్లు సమాచారం.

# యాదగిరిగుట్టలో ఫ్లైఓవర్ తొలగించి కష్టాలు తీరుస్తాం

- షాపులు,ఇళ్ల స్థలాల హామీలను నెరవేరుస్తాం.
- ఫలించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య కృషి
- బాధితులకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాల, సినియాట్రోఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి హామీ

**జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 21:**



యాదగిరిగుట్ట నడిబొడ్డున గల ఫ్లైఓవర్ ను తొలగిస్తామని తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రకటించారు. గతంలో కేసీఆర్ పై నుంచి వచ్చి.. పై నుంచే వెళ్లేవాడని యాదగిరిగుట్ట పట్టణ సమస్యలు ఆయనకు తెలియవని.. తాము ఆనాడు ఎంపీగా ఉన్నప్పుడే ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని వ్యతిరేకించామని మంత్రి గతాన్ని గుర్తు చేశారు. ఫ్లై ఓవర్ తొలగించి స్థానిక ప్రజలకు,దుకాణదారులకు న్యాయం చేయాలని స్థానిక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డికి ప్రత్యేకంగా విజ్ఞప్తి చేశారు. దీంతో మంత్రి ఫ్లైఓవర్ వద్దకు చేరుకుని అండర్ పాస్ వద్ద స్థానికుల అభిప్రాయాలు విన్నారు. తనకు చిన్నప్పటి నుంచే యాదగిరిగుట్ట పరిస్థితి తెలుసునని, గతంలో ఇరు వైపులా దుకాణాలతో యాత్రికుల కోలాహలంతో కళకళలాడేదని అన్నారు. తాను ఓట్ల కోసం మాట్లాడటం లేదని స్పష్టం చేశారు. నిర్మాణం చేసిన కాంట్రాక్టర్ కు గత ప్రభుత్వం 360 కోట్ల రూపాయల బాకీ పడిందని,తాను సంబంధిత శాఖ మంత్రిగా అప్పులు చెల్లిస్తూ వస్తున్నామన్నారు. ఇంజనీర్ ఇన్ చీఫ్ తో ఫోన్లో... ఫ్లై ఓవర్ ను తొలగించేందుకు యాదగిరిగుట్టకు వచ్చి, పరిశీలించి,ఎస్టిమేట్ రూపొందించాలని తెలంగాణ రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా ఇంజనీర్ ఇన్‌చీఫ్ ఫోన్లో ఆదేశాలు జారీ చేశారు. ఎంత వ్యయమైనా సరే ఫ్లై ఓవర్ తొలగించాల్సిందేనని మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య గట్టిగా కృషి చేయడంతో ఫ్లైఓవర్ తొలగింపునకు ప్రభుత్వంలో కదలిక మొదలైంది.



### షాపులు.. ప్లాట్లు సమస్యల పరిష్కారం


సహాయ పునరావాసం కింద.... రోడ్డు విస్తరణలో ఇండ్లు, స్థలాలు కోల్పోయిన అందరికీ ప్రత్యామ్నాయ ఉపాధి నిమిత్తం కేటాయించిన దుకాణాలు,నివాసాల నిమిత్తం ఇచ్చిన ఇళ్ల స్థలాల విషయంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని కూడా మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఈ సందర్భంగా బాధితులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఆలేరుఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, కాంగ్రెస్ నేతలు బీర్ల శంకర్, గుండ్లపల్లి భరత్ గౌడ్,చీర శ్రీశైలం, ముక్కెర్ల మల్లేష్ యాదవ్, ఎరుకల హేమేందర్ గౌడ్, బందారపు బిక్షపతి గౌడ్, మిట్ట రామ చందర్ గౌడ్, సుడుగు జీవన్ రెడ్డి, వంగపల్లి అరుణ్, గౌలికార్ అరుణ రాజేష్, సీసా కృష్ణ, సయ్యద్ సలీం తదితరులు పాల్గొన్నారు.

# పక్కా కమర్షియల్

## ట్రేడ్ లైసెన్స్ లేకుండా.. హాస్టళ్ల దందా

- ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్న వైనం..

**జయభేరి, మేడ్చల్ :**



మేడ్చల్ సర్కిల్ గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధిలోని మైసమ్మగూడలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రయివేటు హాస్టళ్ల అక్రమ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా జోరుగా సాగుతున్నాయి. మైసమ్మగూడలో మల్లారెడ్డి కళాశాల యూనివర్సిటీగా మారడంతో ఇక్కడ చదువుకోవడం కోసం వచ్చే విద్యార్థుల వసతికి మంచి డిమాండ్ ఏర్పడింది. దింతో మైసమ్మగూడలో ప్రభుత్వ నిబంధనలను పాతరవేస్తూ ప్రభుత్వం నుండి జీ+ రెండు అంతస్తుల రెసిడెన్షియల్ అనుమతి తీసుకుని ఐదు అమతస్తుల భవనాలు నిర్మిస్తూ దర్జాగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకువచ్చిన మున్సిపల్ చట్టానికి విరుద్ధంగా మైసమ్మగూడలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి అంటే ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే జరుగుతుందనే విషయం ఓపెన్ సీక్రెట్. ఎలాంటి సెట్ బ్యాక్స్ లేకుండా భవనాలు నిర్మిచి విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారని అనేక విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఏదైనా ప్రమాదం జరిగితే భవనం నుండి వెళ్లే విలులేకుండా ఇరుకు సందులతో నిర్మాణాలు చేస్తున్నారు. ఇదంతా పర్యవేక్షణ చేయాల్సిన అధికారుల ఘనం పిల్లి కళ్ళు మూసుకుని పాలు తాగిన సామెతను పాటిస్తూ అక్రమ నిర్మాణదారులకు కొమ్ము కాస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

### ట్రేడ్ లైసెన్స్ లేకుండా హాస్టళ్ల దందా..

మైసమ్మగూడలో ప్రభుత్వ అనుమతి లేకుండా నిర్వహిస్తున్న హాస్టళ్ల దందా యథేచ్ఛగా కొనసాగుతుంది. రెసిడెన్షియల్ అనుమతి తీసుకొని నిర్మించిన బహుళ అంతస్థులలో కమర్షియల్ వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. నిబంధనల ప్రకారం ఏదైనా వ్యాపారం నిర్వహించాలంటే తప్పనిసరిగా హెచ్ఎండీఏ నిబంధనల మేరకు అనుమతి తీసుకొని ప్రభుత్వానికి ఫీజు చెల్లించి కార్యకలాపాలు చేయాల్సి ఉంటుంది. కానీ మైసమ్మగూడలో హాస్టల్ వ్యాపారం నిర్వహిస్తున్న నిర్వాహకులు మాత్రం ప్రభుత్వ నిబంధనలు మాకు వర్తించావ్ అంటూ ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి కొడుతున్నారు. ప్రభుత్వం నుండి ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండా అక్రమంగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ గుర్తింపు లేకుండా ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండా వ్యాపారాలు చేపట్టడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండి పడుతుందని అధికారులు మాత్రం వ్యాపారులపై ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిజానికి ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేయడం చట్టరీత్యా విరుద్ధం. ఇప్పటికైనా అధికారులు ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారాలు నిర్వహిస్తున్న వారిపై చర్యలు తీసుకొని నిబంధనల మేరకు ఫీజులు వసూళ్లు చేసి ప్రభుత్వ ఆదాయానికి నష్టం వాటిల్లకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

# ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు

**జయభేరి, పరవాడ:**



పరవాడ గ్రామంలో పద్మశాలి సంఘమ్ ఆధ్వర్యంలో మార్కండేయ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు వానపల్లి అప్పలరాజు మాట్లాడుతూ.. మార్కండేయ చరిత్ర అంటే, బృగు వంశానికి చెందిన మహర్షి మృకండు, మరుద్వతి దంపతులకు శివుని వరంతో జన్మించిన 16 ఏళ్ళకే మరణించాల్సిన వాడు శివుని అపార భక్తితో మృత్యువును జయించి చిరంజీవిగా మారిన మార్కండేయ మహర్షి కథ అని తన భక్తితో యముడిని ఎదిరించి శివుని అనుగ్రహంతో అమరత్వం పొందిన ఈయన పేరు మీద మార్కండేయ పురాణం ఉందని మహాభారతం, భాగవతంలో కూడా ఈయన ప్రస్తావన ఉంది అని తెలిపారు. ఈ యొక్క కార్యక్రమంలో వానపల్లి సూరిబాబు దంపతులు. సిద్దనాతి దేవుడు దంపతులు. సూరిశెట్టి రామఅప్పారావు దంపతులు.బ్యాంకు దేవుడు దంపతులు. దొడ్డి కృష్ణ దంపతులు. నేమల రాము దంపతులు.తేలు మురళి దంపతులు. వానపల్లి చలపతిరావు, తేలు పైడిరాజు, గుదే సంజీవరావు, కాకి వీరభద్రరావు, గుదే పైడి రాజు దొడ్డి నూక అప్పారావు, తేలు రమణజీ,కుల సంఘ సభ్యులు అందరూ కూడా హాజరయ్యారు.



# మరోసారి తన దాతృత్వ హృదయాన్ని చాటుకున్న మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**జయభేరి, శామీర్ పేట్, జనవరి 21 :**

ఎల్లంపేట మున్సిపాలిటీ పరిధిలోని డబిల్ పూర్ గ్రామానికి చెందిన బ్రహ్మలపల్లి శ్రీనివాస్ గౌడ్ ఇటీవల అకాలంగా మృతి చెందారు. కాగా మృతుని కుటుంబ సభ్యులు ఆర్థికంగా వెనుకబడి ఉండడంతో నియోజకవర్గానికీ చెందిన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీసరి మహిపాల్ రెడ్డి ద్వారా ఈ విషయం తెలుసుకున్న మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కుటుంబ ఆర్థిక పరిస్థితి పై ఆరా తీశారు. కూతురు పెళ్లి ఉందనే విషయం మంత్రి దృష్టికి రాగానే వెంటనే శ్రీనివాస్ గౌడ్ కూతురు పెళ్లి కోసం 5లక్షల ఆర్థిక సహాయం అందజేసారు.. అదేవిధంగా శ్రీనివాస్ గౌడ్ భార్య రజినికి,వారి కుటుంబానికి మనోధైర్యం చెప్పారు. వారి కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా మంత్రికి శ్రీనివాస్ గౌడ్ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# అవసరమైతే కేసీఆర్ కు నోటీసులు?

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ ఫోన్ ట్యాపింగ్ కేసులో అనివార్యమైతే మాజీ సీఎం కేసీఆర్ కు నోటీసులు ఇస్తారని పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ స్పష్టంచేశారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, పారిశ్రామికవేత్తలతోపాటు సొంత ఎమ్మెల్యేల ఫోన్లను ట్యాప్ చేయించిన చరిత్ర మాజీ మంత్రి కేటీఆర్, కేసీఆర్ హయాంలో నాతోపాటు రేవంత్ రెడ్డి ఫోన్లను ట్యాప్ చేయించారు. చేసిన తప్పుకు విచారణ చేస్తే..రాజకీయ వేధింపు ఎలా అవుతుంది అని ప్రశ్నించారు.



# ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలి

**జయభేరి, తుర్కపల్లి, జనవరి 21 :**

రహదారి వినియోగదారులందరూ ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఎస్సై తక్యుద్దీన్ అన్నారు. బుధవారం తుర్కపల్లి మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఆరవ రోజు పత్రికా మీడియా, సోషల్ మీడియా, ఫ్లాట్ ఫార్ములా ద్వారా ఒక ప్రత్యేక అవగాహన ప్రచారం నిర్వహించారు. రహదారి భద్రత సందేశాలు, ప్రమాద నివారణ చిట్కాలు, సలహా కాంటెంట్ గరిష్ట సంఖ్యలో పౌరులకు చేరేలా సురక్షితమైన డ్రైవింగ్ పద్ధతుల ప్రాముఖ్యత గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి విస్తృతంగా ప్రచారం నిర్వహించినట్లు తెలిపారు. రహదారి వినియోగదారులందరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని, అతివేగాన్ని నివారించాలని, మద్యం తాగి వాహనాన్ని నడపకుండా ఉండాలని, హెల్మెట్, సీటు బెల్టు ధరించాలని, తమకు ఇతరులకు సురక్షితమైన ప్రయాణాన్ని నిర్ధారించుకోవాలని తెలిపారు. రహదారి భద్రత నియమాలను పాటించి తెలంగాణను ప్రమాద రైతు రాష్ట్రంగా మార్చడానికి ప్రతిజ్ఞ చేద్దామని సూచించారు. అరైవ్ అలైవ్ భద్రతే ప్రధమం, జీవితమే సర్వస్వం అనే నినాదంతో ముందుకెళ్దాం అని అన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం పెంపొందుతుంది



**జయభేరి, తుర్కపల్లి, జనవరి 21 :**

క్రీడలతో మానసిక ఉల్లాసం శారీరక దృఢత్వం పెంపొందుతుందని ఎంఈఓ మంజుషారాణి అన్నారు. బుధవారం తుర్కపల్లి మండలం దత్తాయపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీఎం క్రీడలను గ్రామ సర్పంచ్ జేరుపోతుల కరుణాకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని అన్నారు. సీఎం క్రీడలను యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు చాడ భాస్కర్ రెడ్డి, గంధమల్ల సర్పంచ్ బొత్త రాములు, ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి నరసింహ, గ్రామ యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ సిపారసుతో మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణి

- బూర్గుల గ్రామంలో లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



**జయభేరి, షాద్ నగర్, జనవరి 21 :**

రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ నియోజకవర్గంలోని ఫరుక్ నగర్ మండలం బూర్గుల గ్రామానికి చెందిన చాకలి జంగమ్మ, లింగరెడ్డిగూడెం నరసింహులుకు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి సిఫారసు మేరకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులని నేరుగా లబ్ధిదారుని గ్రామంలోని వారి గృహానికి వెళ్లి ఫరక్ నగర్ మండల్ మాజీ వైస్ ఎంపీపీ మౌనిక హరికృష్ణ గౌడ్,బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు సంతోష్ కుమార్ అందజేశారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పవన్ కుమార్ లింగరెడ్డిగూడెం శేఖర్, రమేష్ ,సీనియర్ నాయకులు; గౌంది సాయి రెడ్డి, సి ఎల్లయ్య ,చక్కటి ప్రభాకర్, సురేష్ ,పుల్లని రమేష్, ఎల్. నర్సింలు, కుమ్మరి యాదయ్య,యుగంధర్ ,నాగేష్ తదితరులు పాల్గొన్నారు.


# డీసీఎం ఓనర్ అధ్యక్షునిగా ఎన్నికైన

- బల్సుగూరి ఐలయ్య



**జయభేరి, పరకాల, జనవరి 21 :**

పరకాల డీసీఎం ఓనర్స్ అధ్యక్షునిగా బల్సుగూరి ఐలయ్య, ఉపాధ్యక్షుడిగా కంచం నాగరాజు ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డీసీఎం ఓనర్స్ తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఐలయ్య మాట్లాడుతూ.. నా ఎన్నికకు సహకరించిన ఓనర్స్ అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. డ్రైవర్లకు ఓనర్లకు ఎలాంటి సమస్య వచ్చినా కూడా మీ ముందుండి ఆ సమస్యను పరిష్కరించే దిశగా ముందుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బుర్ర సదానందం, క్యాషియర్ సురేష్, గౌరవ అధ్యక్షులు తౌడు శీను, మేకల ఎంకన్న, కక్కర్ల నాగరాజు, ఓనర్స్ బిక్షపతి, శ్రీను, దేవేందర్, రాముమూర్తి, శ్రీను, రవీందర్, సదానందం, శ్రీనివాస్, పాషా అజయ్, శివ కృష్ణ పాల్గొన్నారు.



## కోడి పందాల స్థావరంపై పోలీసులు దాడులు

జయభేరి, పరవాడ:

పరవాడ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈ. మర్రిపాలెం గ్రామ శివారులో బుధవారం నిర్వహించిన దాడుల్లో కోడి పందాలు ఆడుతున్న 4 మందిని పరవాడ పోలీస్ శాఖ అధికారులు అదుపులోకి తీసుకోన్నారు .ఈ దాడుల్లో వారి వద్ద నుండి రూ. 4,080/నగదుతో పాటు 3 కోడి పుంజులను స్వాధీనం చేసుకొన్నారు.ఈ ఘటనపై సంబంధిత కేసు నమోదు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని పరవాడ మండల గ్రామాల్లో కోడి పందాలు, పేకాటలు వంటి అక్రమ కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీస్ శాఖ నిరంతరం నిఘా కొనసాగిస్తూ దాడులు నిర్వహిస్తాం అని పరవాడ పోలీసులు హెచ్చరిస్తున్నారు.

## ఉచిత పశు ఆరోగ్య శిబిరానికి విశేషా స్పందన



జయభేరి, పరవాడ:

పరవాడ మండలంలో మంత్రిపాలెం గ్రామంలో బుధవారం నిర్వహించిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని లంకెలపాలెం పశు వైద్యాధికారి డా అనూష మట్టే నిర్వహించారు. ఈ సందర్భంగా 80 పశువులకు వైద్య సేవలు,ఎదకు రాని పశువులకు గర్భకోశ వ్యాధులకు చికిత్స చూడి తనిఖీలు నిర్వహించారు. 35 పెయ్యలకు నట్టల నివారణ మందులు, 40 పాడి పశువులు నట్టల నివారణ మందులు అందించారు. పశువులు ఎదకు రావడానికి మందులు, కోళ్లకు మందులు అందించారు. ఈ కార్యక్రమం లో సిబ్బంది కళ్యాణి, పశు వైద్య సహాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్, గోపాలమిత్ర నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి కుంటు పడింది

- కృష్ణ యాదవ్



జయభేరి, శామీర్ పేట్, జనవరి 21 :

కాంగ్రెస్, బిఆర్ ఎస్ పాలనలో ప్రజలకు ఒరిగింది ఏమి లేదని, మూడు చింతలపల్లి మున్సిపల్ లో కాషాయ జెండాను ఎగురవేస్తామని మాజీ మంత్రి, మూడుచింతలపల్లి మున్సిపల్ ఎన్నికల ఇంచార్జి కృష్ణ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. బుధవారం మేడ్చల్ జిల్లా మూడు చింతలపల్లి మున్సిపల్ పరిధిలోని బీజేపీ మండల అధ్యక్షుడు తప్పెట్ల నరేందర్ గౌడ్ ఆధ్వర్యంలో పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ యాదవ్ మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికలో ప్రతి వార్డులో ప్రతి ఒక్కరు పార్టీ కోసం కష్టపడి బీజేపీ అభ్యర్థిని గెలిపించుకోవాలని సూచించారు. గత బిఆర్ ఎస్ మరియు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి పూర్తిగా కుంటు పడిందని ఆరోపించారు. మూడు చింతల పల్లి మున్సిపాలిటీలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని వారు ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బుద్ది శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి గౌనె శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి నాగరాజు చారి, నరేందర్ రెడ్డి మున్సిపల్ ప్రధాన కార్యదర్శులు శ్రీశైలం, శ్రీకాంత రెడ్డి, ఉపాధ్యక్షులు పరమేష్ గౌడ్, విజయలక్ష్మి, దొంద మహేష్, లక్ష్మి నారాయణ, కార్యదర్శి జగన్ మోహన్ రెడ్డి, వీరేష్ నాయక్, ర్యాకల నర్సింలు గౌడ్, ప్రేమ్, వెంకటేష్, బాబు వినోద్, ముఖ్య నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అనాధ ఆశ్రమంలో అనాథలకు పండ్లు పంపిణీ

- ఘనంగా సీనియర్ ఉద్యమకారులు అఫ్జల్ ఖాన్ జన్మదిన వేడుకలు..




జయభేరి, శామీర్ పేట్, జనవరి 21 :

శామీర్ పేట మండల కేంద్రంలో సీనియర్ ఉద్యమకారులు, కాంగ్రెస్ నాయకులు మహ్మద్ అఫ్జల్ ఖాన్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్టిన రోజు సందర్భంగా శామీర్ పేట లోని మాతృశ్రీ అనాధ ఆశ్రమంలో అనాథలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనాధ ఆశ్రమాలు తన జన్మదిన వేడుకలు జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని సూచించారు. తమ సంపాదనలో ఎంతో కొంత సమాజ సేవకు వినియోగించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, , నాయకులు నర్సింహ రెడ్డి, బత్తినీ రాజు గౌడ్, ఆశ్రమ ఫౌండర్ నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అప్పుల ఊబిలోకి కూరుకుపోయింది

- అలియా బాద్ లో కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశానికి హాజరైన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి
- మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీనీ భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపు



జయభేరి, శామీర్ పేట్, జనవరి 21 :

10 ఏళ్ల బిఆర్ ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం అప్పుల ఊబిలో కూరుకు పోయిందని రాష్ట్ర మంత్రి, మేడ్చల్ జిల్లా మున్సిపల్ ఎన్నికల ఇంచార్జ్ కోమటి రెడ్డి వెంకటరెడ్డి ఆరోపించారు. తెలంగాణ ప్రాంతాన్ని దోచుకున్న వారికి తగిన గుణపాఠం చెప్పాలని ఆయన సూచించారు. బుధవారం అలియాబాద్ మున్సిపాలిటీలోని శుభం గార్డెన్‌లో మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేశ్ యాదవ్ అధ్యక్షతన మూడుచింతలపల్లి, అలియాబాద్, ఎల్లంపేట్ మున్సిపాలిటీలకు సంబంధించిన కాంగ్రెస్ పార్టీ విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తో పాటు మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, మాజీ డీసీసీ అధ్యక్షులు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, నక్క ప్రభాకర్ గౌడ్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన రెండు సంవత్సరాల కాలంలో అనేక సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేసిందని గుర్తు చేశారు . ఎన్నికల హామీల మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, ముఖ్యమంత్రి సహాయ నిధి, గృహ జ్యోతి పథకం, కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రేషన్ కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఇండ్ల పంపిణీ వంటి పథకాలతో పాటు మున్సిపాలిటీల్లో కోట్ల రూపాయల వ్యయంతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఘనత కూడా కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని తెలిపారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు తోటకూర వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ ఇక్కడి ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చి ప్రజా సంక్షేమాన్ని పట్టించుకోకుండా ఈ ప్రాంతాన్ని దోచుకున్న దోపిడీదారులకు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ధనబలంతో ఓటర్లను మభ్యపెట్టే ప్రయత్నాలు చేస్తున్న పగటి వేషధారులను ప్రజలు తిరస్కరించాలని ఆయన కోరారు. మూడు మున్సిపాలిటీల్లో మెజారిటీ వార్డులను కైవసం చేసుకుని చైర్మన్, వైస్ చైర్మన్ పదవులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, జిల్లా ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబులకు కానుకగా అందిస్తామని తెలిపారు. ఇప్పటి నుంచే గెలుపు అవకాశాలు ఉన్న అభ్యర్థుల వివరాలు సేకరించి, అర్హులైన వారికి పార్టీ టికెట్లు కేటాయిస్తామని చెప్పారు. టికెట్ ఎవరికివచ్చినా అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ శరత్ చంద్ర రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మహిపాల్ రెడ్డి, మేడ్చల్ మున్సిపాలిటీ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహా యాదవ్, మేడ్చల్ నియోజకవర్గ ఏ, బి అధ్యక్షులు వేణుగోపాల్ రెడ్డి, వేముల మహేష్ గౌడ్, అలియాబాద్ అధ్యక్షులు తుంకి రమేష్, ఎల్లంపేట్ మున్సిపల్ అధ్యక్షులు విఘ్నేశ్వర రెడ్డి, మూడు చింతలపల్లి అధ్యక్షులు దోసకాయల వెంకటేష్, బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తో పాటు మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




## మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి

జయభేరి, ఉప్పల్ :

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని గ్రీన్ హిల్స్ కాలనీలో రూ.72 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి బుధవారం స్థానిక కార్పొరేటర్ దేవేందర్ రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించి పనిచేస్తున్నాం అని పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు, ప్రతి కాలనీలో నాణ్యమైన రహదారులు ఏర్పాటు చేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో GHMC అధికారులు BRS పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ కు భారీ షాక్

- ఉప్పల్ నియోజకవర్గం లో బీర్ఎస్ పార్టీ వీడుతున్న నేతలు, కార్యకర్తలు
- కాంగ్రెస్ లో భారీ ఎత్తున చేరికలు



జయభేరి, ఉప్పల్ :

ఉప్పల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ కు భారీ షాక్ తగిలింది. ఉప్పల్ లో భారీ ఎత్తున కాంగ్రెస్ పార్టీ లో చేరారు. ఉప్పల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందముల పరమేశ్వర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో భారీ సంఖ్యలో చేరారు. పార్టీలో చేరిన వారికి పరమేశ్వర్ రెడ్డి, పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యంలో ప్రజాపాలన నడుస్తుందని ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న ఆరు గ్యారంటీల అమలతో అన్ని పార్టీల దృష్టి కాంగ్రెస్ వైపు మళ్లిందన్నారు. సత్యనగర్ కాలనీ CS నరేష్, జనగామ భాను, జనగామ రాకేష్, గాంధీ నగర్ మార్కెట్ సన్నాయిల బాలరాజు, మంచాల నర్సింగ్ రావు, జైపల్లి శివ కుమార్, మైలారం ప్రభాకర్, దేవా, రాజు, మల్లికార్జున్, సన్నాయిల అశ్విని, హేమలత, భాగ్యమ్మ, గీత, లక్ష్మి, అంబికా, దుర్గమ్మ, మహేశ్వరి, సత్యమ్మ కాంగ్రెస్ పార్టీలో చేరినవారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బకారం లక్ష్మణ్, ఈగ అంజయ్య, లింగంపల్లి రామకృష్ణ, అలుగుల అనీల్ కుమార్, అల్వాల భాస్కర్, నోముల సురేష్,కాటేపల్లి విజయ్ కుమార్, కుశంగల సతీష్, ఈగ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## యాదగిరిగుట్ట మున్సిపాలిటీ బీజేపీదే..

- బీజేపీ ఎన్నికల సమావేశంలో బండారు విజయలక్ష్మీ



జయభేరి, యాదగిరిగుట్ట, జనవరి 21:

యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారం కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్న భారతీయ జనతా పార్టీ పట్ల ప్రజలంతా సానుకూల స్పందనతో ఉన్నారని, 12 వార్డుల్లో జిజెపి పార్టీ అభ్యర్థులను సమిష్టి కృషితో గెలిపించుకొని మున్సిపల్ చైర్మన్ పదవిని దక్కించుకునే దిశగా కృషి చేయాలని జిజెపి రాష్ట్ర కార్యదర్శి బండారు విజయలక్ష్మి అన్నారు. బుధవారం యాదగిరిగుట్ట పట్టణంలో నిర్వహించిన బిజెపి ఎన్నికల సమావేశంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని జిజెపి పార్టీ శ్రేణులకు దిశా, నిర్దేశం చేశారు. తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన యాదగిరిగుట్టలో బిజెపి జెండా ఎగరడం ఖాయం, ఎన్నడూ లేని విధంగా యాదగిరిగుట్ట పట్టణంలో ప్రజలు బిజెపిని విశేషంగా ఆదరిస్తున్నారు. ఇంత స్పందన చూస్తే నాకు కూడా ఎంతో సంతోషంగా ఉందని,యువ కార్యకర్తలు పార్టీకి వెన్నుముకగా ఉన్నారు. ప్రతి సమస్యపైన, భక్తుల సౌకర్యాల మీద పట్టణ ప్రజల సమస్యల మీద,కాంగ్రెస్ నాయకుల అవినీతి మీద యాదగిరిగుట్ట పట్టణ బిజెపి పోరాటం చూస్తుంటే.. ఈ సారీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులు అందరూ విజయదుందుభిమోగించడం ఖాయమన్నారు. అందువల్ల 12 వార్డుల్లో కసిగా పనిచేసి మున్సిపల్ చైర్మన్ పీఠాన్ని కైవసం చేసుకోవడం సత్యమని తధ్యమని ఆమె ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో జిజెపి పార్టీ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి అశోక్ గౌడ్,జిల్లా ప్రధాన కార్యదర్శి కాదూరి అచ్చయ్య, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ రచ్చ శ్రీనివాస్,పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్, జిల్లా కౌన్సిల్ మెంబర్ ఆకుల చంద్రమౌళి,ఎన్నికల కన్వీనర్ లెంకలపల్లి శ్రీనివాస్, తాళ్ల భాస్కర్ రెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి జిల్లా భానుచందర్, మందోజు నరేష్, కార్యదర్శులు ప్రభాకర్, సురేష్ ఆలేటి కర్ణ, సీనియర్ నాయకులు రంగ సత్యం, బంధారపు మల్లేష్, భువనగిరి శ్యాంసుందర్, బోడ సురేష్, నల్ల వెంకట్ రెడ్డి, అశోక్, నరేష్ పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హకింపేట బస్ డిపోలో జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు

- రహదారి భద్రతపై సూచనలు అందించిన జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్
- ఉత్తమ డ్రైవర్లకు నగదు, ప్రశంసా పత్రం అందచేత....



జయభేరి, శామీర్ పేట్, జనవరి 21 :

రోడ్డు భద్రత నియమాలను అందరు తప్పనిసరిగా పాటించాలని జోనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ రాజశేఖర్ స్పష్టం చేశారు. హకింపేట లోని ఆర్టీసీ బస్ డిపోలో తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సికింద్రాబాద్ రీజియన్ ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల ముగింపు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాజశేఖర్, తో పాటు ఆర్టీవో అధికారి త్రివేణి హాజరై డ్రైవర్ లకు రోడ్డు భద్రత పై పలు సూచనలు చేసారు. అనంతరం ఈ సంవత్సర స్లోగన్ గా సడక్ సురక్ష జీవన్ రక్ష అనే నినాదాన్ని ప్రకటించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రత పై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.అనంతరం రీజియన్ లెవెల్ లో గత 32 సంవత్సరాల కాలంలో ఎలాంటి రోడ్డు ప్రమాదాలు జరగకుండా వ్యవహరించిన ముగ్గురు ఉత్తమ డ్రైవర్లను ప్రకటించారు. ఇందులో చెంగిచెర్ల డిపోకు చెందిన వెంకటేశ్వర్లు, కంటోన్మెంట్ డిపోకు చెందిన సురేష్, రాణిగంజ్ డిపోకు చెందిన పరశురామ్ లకు నగదు పురస్కారంతో పాటు, ప్రశంసా పత్రం అందచేసారు. అదేవిధంగా హకీంపేట్ డిపో కు చెందిన ముగ్గురు ఉత్తమ డ్రైవర్లు అయిన నాగరాజు,మోహన్ రావు , భాస్కర్ లకు సైతం నగదు బహుమతి ప్రశంసా పత్రాలు అందచేసారు. ఈ కార్యక్రమంలో రీజనల్ మేనేజర్ సుచరిత, డిప్యూటీ రీజినల్ మేనేజర్స్ పవిత్ర, అపర్ణ కల్యాణి, చౌహాన్, విజిలెన్స్ డైరెక్టర్ మహంకాళి,డిపో మేనేజర్ సరితాదేవి, మెకానికల్ ఫోర్ మెన్ రామ్ మోహన్, ఆఫీస్ సూపరింటెంట్ సత్యం, గోపు శ్రీనివాస్, పవన్ కుమార్, గ్యారేజ్ మెకానిక్ రఘు, వెల్ఫేర్ బోర్డ్ మెంబెర్స్ శ్రీలత, మోహన్ రావు లతో పాటు 11 డిపోలకు చెందిన ఉద్యోగులు పాల్గొన్నారు.

## వినతిపత్రం అందజేసిన మాజీ సర్పంచ్

జయభేరి, ఘట్కేసర్ :



ఘట్కేసర్ లోని బాలాజీ భూములను దేవరాబాలాజీ మార్చడం వల్లనా ప్రభుత్వం ప్రోహిబిటెడ్ లిస్ట్ నుండి ఈ భూములను తొలగించవలసిందిగా కోరుతూ మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్, జిల్లా జాయింట్ కలెక్టర్(రెవిన్యూ) విజేందర్ రెడ్డికి వినతిపత్రం అందజేసిన ఘట్కేసర్ మాజీ సర్పంచ్ అబ్బసాని యాదగిరి యాదవ్. ఈ సందర్భంగా అబ్బసాని యాదగిరి యాదవ్ గారు మాట్లాడుతూ.. ఘట్కేసర్ లోని బాలాజీ నగర్, ద్వారకానగర్, గాంధీ నగర్, పలు ప్రాంతాల్లో ఈ భూములులో ఉండటం వంటి ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు, ఇంటి నెంబర్, కరెంట్ మీటర్ లు ఇవ్వడం లేదు అన్ని ఈ యొక్క దేవరాబాలాజీ భూమిలకు సంబంధించిన సమాచారం ఈ లెక్క లో ఉన్నాయి అన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి ఈ భూములను రెగ్యులేషన్ చేసే విధంగా మీరు చొరవ తీసుకోవాలని తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఘట్కేసర్ మాజీ కౌన్సిలర్ బేతాల నర్సింగరావు, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బర్ల రాధాకృష్ణ ముదిరాజ్, మాజీ వార్డు సభ్యులు కొత్తకొండ వెంకటేష్, బర్ల దేవేందర్ ముదిరాజ్, శశిధరన్ పాల్గొన్నారు.

# బీజేపికి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తాం

- కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డా ఖాళీ ప్రసాద్
- పరకాల పట్టణ సమస్యల పై బీజేపీ నిరసన కార్యక్రమలో వ్యాఖ్య
- పరకాలకు తీరం అన్యాయం చేసింది బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు
- రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో పరకాల పట్టణ ప్రజలు బిజెపి కి అవకాశం ఇవ్వాలి



**జయభేరి, పరకాల, జనవరి 21:**

పరకాల పట్టణంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో పాత మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమం నిర్వహించారు. పరకాల పట్టణ బీజేపీ అధ్యక్షుడు గాజుల నిరంజన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్, కాచం గురు ప్రసాద్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కాళీ ప్రసాద్ రావు మాట్లాడుతూ పరకాల అభివృద్ధిని బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు నిర్లక్ష్యం చేశాయని విమర్శించారు. గతంలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి కమిషన్ల కోసమే పనులు ప్రారంభించారని, ప్రస్తుతం కాంగ్రెస్ ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి కమిషన్ రాకపోవడంతో అభివృద్ధి పనులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పరకాల పట్టణంలో టూ లెట్ బోర్డుల పరిస్థితి దయనీయంగా మారిందని, వ్యాపారాలు లేక వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటుకు ఉద్యమం జరిగిన సమయంలో అప్పటి ఎమ్మెల్యే విదేశీ పర్యటనల్లో మునిగిపోయారని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం జిల్లాల పునరుద్ధరణపై కాంగ్రెస్ ప్రభుత్వం చర్యలు చేపడుతున్నా పరకాలకు అమరవీర జిల్లా, మెడికల్ కాలేజీ తీసుకురావడంలో ఎమ్మెల్యే విఫలమయ్యారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ అంశాలపై స్పందించకపోతే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఒకవేళ పరకాల అమరవీరుల జిల్లా కోసం రాజీనామా చేస్తే మము మేకు మద్దతు తెలిపి గెలిపిస్తామని పేర్కొన్నారు. పరకాలలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్, ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఇప్పటికీ కాగితాలకే పరిమితమయ్యాయని అన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీని 22 వార్డుల్లో గెలిపిస్తే పరకాల అభివృద్ధిని చేసి చూపెడతామని హామీ ఇచ్చారు. కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉందని, రాష్ట్రం నుంచి ఎనిమిది మంది ఎంపీలు ఉన్నారని, ఢిల్లీ స్థాయిలో పోరాడి అయినా పరకాల అభివృద్ధిని సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. కమిషన్లకు అతీతంగా పనిచేసే పార్టీ బీజేపీ మాత్రమేనని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో చందుపట్ల రాజేందర్ రెడ్డి, ఆర్పి జయంత్ లాల్, దేవునూరి మేఘనాథ్, కొలనుపాక భద్రయ్య, బెజ్జంకి పూర్ణచారి, ఎర్ర రామన్న, సంఘ పురుషోత్తం, దగ్గు విజేందర్ రావు, కుక్కల విజయ్, బాసాని సోమరాజు, ఎరుకల దివాకర్, నాగెల్లి రంజిత్, రూరల్ అధ్యక్షులు కాసగాని రాజ్ కుమార్, పాలకుర్తి తిరుపతి, సల్పల సురేష్, పైండ్ల రంజిత్, వెలిశెట్టి శారద, వేముల సదారాణి, దంచనాదుల సత్యనారాయణ, పావుశెట్టి శ్రీనివాస్, దుబాసి కృష్ణ ప్రసాద్, కక్కు రాజు, బూత్ అధ్యక్షులు ఆకుల శ్రీధర్, సాదా మధుకర్, కృపేందర్ రెడ్డి, మరాఠి నర్సింగ్, ముత్యాల దేవేందర్, దామ సతీష్, సంగా నరేష్, తడక విక్రం, బీరం రాజిరెడ్డి, దాసరి వెంకటేశ్వర్లు, చంద్రమోహన్, పల్లె బోయిన భద్రయ్య, గునిగంటి రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

# బీసీలంతా ఐక్యం కావాలి

- తీన్మార్ మల్లన్న



**జయభేరి, తుర్కపల్లి, జనవరి 21 :**

బీసీలంతా ఐక్యం కావాలని, బీసీ, ఎస్సీ , ఎస్టీ, రాజకీయ, ఆర్థిక సామాజిక వాట దక్కాలంటే తెలంగాణ రాజ్యాధికార పార్టీతోనే సాధ్యమని తెలంగాణ రాజ్యాధికార పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న అన్నారు. బుధవారం తుర్కపల్లి మండలం ములకలపల్లి, సంగ్య తండా, రాంపూర్ తండా, బాబుల నాయక్ తండ, పెద్ద తండా, రుస్తాపురం, ధర్మారం, రామోజీ నాయక్ తండ, గొల్లగూడెం, పల్లె పహాడ్, మోతి రామ్ తండా గ్రామాల్లో టిఆర్పి పార్టీ జెండా ఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 11 గ్రామాల్లో కలిపి 1500 మంది వివిధ పార్టీల నుండి టీఆర్పీ పార్టీలో తీన్మార్ మల్లన్న సమక్షంలో చేరారు. అనంతరం ధర్మారం గ్రామంలోని శ్రీ సాయిరామ కళ్యాణ వేదికలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు న్యాయం జరగాలంటే టీఆర్పీ పార్టీతోనే సాధ్యమని అన్నారు.

తుర్కపల్లి మండలంతో బీసీ శంఖారావాన్ని పూరించినట్లు అనంతరం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించి అనంతరం రాష్ట్రవ్యాప్తంగా పార్టీని విస్తరింపచేస్తామని అన్నారు. రాబోవు ఎంపీటీసీ, జెడ్పిటిసి, మున్సిపల్ ఎన్నికల్లో టిఆర్పి పార్టీ తరఫున అభ్యర్థులను నిలబెట్టి గెలిపిస్తామని అన్నారు. ఈ భూమి మనది గువ్వ మనది అందరం కలిసి పంచుకొని తిందామని అన్నారు. తెలంగాణలో రాష్ట్రంలో ఎక్కడ నా కార్యకర్తకు ఏ కష్టం వచ్చినా ఆపద వచ్చిన ఆదుకుంటానని అన్నారు. పిఆర్పి పార్టీ కత్తెర గుర్తు వచ్చిందని ఆ గుర్తుని మర్చిపోవద్దని అన్నారు. తెలంగాణలో ఉన్న బీసీలందరూ ఐక్యం తోటి పోరాడి బీసీ ముఖ్యమంత్రిని చేసుకునే బాధ్యత మనందరిపైనే ఉందని అన్నారు. వెనుకబడిన తరగతుల వాళ్ళమేనని అన్నారు. బీసీలకు అన్యాయం జరుగుతుందని బీసీలందరం ఐక్యంగా ఉంటే బీసీ సీఎం ఎందుకు కాదని ఆ దమ్ము ధైర్యం మన పార్టీ వద్ద ఉందని అన్నారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధికారంలోకి వస్తే 78 ఏళ్ల రెడ్డి, దొరల దోపిడీ పాలనాకు చరమగీతం పాడుతామని అన్నారు. గత 15 ఏళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు చేసింది ఏమీ లేదని, ఈ రెండు సంవత్సరాల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో పూర్తిగా విఫలమైందని, మహిళలకు 2500, వృద్ధాప్య పెన్షన్ 4000 ఇస్తామని మాట ఇచ్చి తప్పిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రాబోవు కాలంలో ప్రజలు బుద్ధి చెప్పాలని అన్నారు. త్వరలో పార్టీ లక్ష్యాలను భవిష్యత్తు కార్యాచరణను రాష్ట్రవ్యాప్తంగా వివరిస్తూ కార్యకర్తల్లో గుండెబోయిన కృష్ణమూర్తి, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికల్లో దేవరకొండ ఖిల్లాపై గులాబీ జెండా ఎగరవేయాలి

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ మున్సిపల్ ఎన్నికల్లో దేవరకొండ ఖిల్లాపై గులాబీ జెండా ఎగరవేయాలి అని BRS రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ అన్నారు . బుధవారం దేవరకొండ మున్సిపాలిటి పరిధిలోని 18 వ తాజా మాజీ వార్డ్ కౌన్సిలర్ విరమోని అంజి గౌడ్ నివాసం లో ఏర్పాటు చేసిన BRS పార్టీ నాయకుల , కార్యకర్తల సమావేశంలో పాల్గొన్న BRS రాష్ట్ర నాయకులు నేనావత్ కిషన్ నాయక్ కి శాలువాతో సత్కరించారు మాజీ వార్డ్ కౌన్సిలర్ విరమోని అంజి గౌడ్ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కెసిఆర్ నాయకత్వంలో రాష్ట్రము అభివృద్ధి చెందింది అని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అములు చేయకుండ పాలన ను గాలికి వదిలేశారు అని అన్నారు .పట్టణ ప్రాంతాల ప్రజలు కాంగ్రెస్ పార్టీపై తీవ్రమైన ఆగ్రహంతో ఉన్నారని, రెండు సంవత్సరాలుగా ఒక్క రూపాయి కూడా ఏ పట్టణానికి చెల్లించని ఏకైక ప్రభుత్వంగా కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోతుందని ఆయన అన్నారు.కాంగ్రెస్ రెండు సంవత్సరాల పాలనలో పట్టణాల్లో పరిపాలన పూర్తిగా పడకేసిందని, పారిశుద్ధ్యం నుంచి ప్రతి అంశంలో పట్టణ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.గత ప్రభుత్వం కేటాయించిన అభివృద్ధి కార్యక్రమాలకు మరోసారి శిలాఫలకాలు వేయడం తప్పించి ఈ కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన పని ఒక్కటి కూడా లేదన్నారు 18 వార్డ్ లో మల్లి గులాబీ జెండా ఎగరడం ఖాయం అని అన్నారు.

# షాద్ నగర్ మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశం

- షాద్ నగర్ మున్సిపాలిటీపై బీజేపీ జండా ఎగిరి వేద్దాం
- డాక్టర్ ప్రకాష్ రెడ్డి బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి
- పట్టణ శక్తి కేంద్ర బూత్ కమిటీ సమావేశం
- మణికొండ రంగయ్య గౌడ్ ఎన్నికల కన్వీనర్ అధ్యక్షతన సమావేశం
- ముఖ్య అతిథులుగా పాల్గొన్న నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డి, అందే బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి, కక్కునూరు వెంకటేష్ గుప్త..



**జయభేరి, షాద్ నగర్, జనవరి 21 :**

రంగా రెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణంలోని ఏబి కన్వెన్షన్ హాల్ లో బుధవారం బిజెపి షాద్ నగర్ పట్టణ మున్సిపాలిటీ ఎన్నికల సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ ప్రకాష్ రెడ్డి బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి మాట్లాడుతూ.. షాద్నగర్ పట్టణ మున్సిపాలిటీపై బీజేపీ జెండా ఎగిరివేయాలని పిలుపునిచ్చారు. నెల్లి శ్రీ వర్ధన్ రెడ్డిమాట్లాడుతూ.. షాద్నగర్ పట్టణంలో వాతావరణం లేదని బిజెపి పార్టీకి అనుకూలమైన వాతావరణం ఉందని అందరం కలిసికట్టుగా పనిచేస్తే బిజెపి మున్సిపాలిటీ కైవాసం చేసుకోవచ్చని అన్నారు. అందే బాబయ్య మాట్లాడుతూ.. మన ప్రియతమ ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ చేసిన అభివృద్ధి పథకాలే గెలిపిస్తుందని అన్నారు. పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎలక్షన్ ఒక ఛాలెంజ్గా తీసుకొని ఒక తమ ప్రణాళిక ప్రకారం చేస్తే విజయం సులభం అవుతుందని అందరం కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు అమ దాపురం నర్సింలు గౌడ్, చెంది మహేందర్ రెడ్డి, మోటే శ్రీనివాస్, కే వంశీకృష్ణ పేట అశోక్, మోహన్ సింగ్ లష్కర్ నాయక్ శక్తి కేంద్రీ ఇన్చార్జి లు బూత్ కమిటీ అధ్యక్షులు కార్యకర్తలు పాల్గొన్నారు.


# రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు




**జయభేరి, హయత్ నగర్ :**

రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా కోహెడ నారాయణ కాలేజీ నందు ఇంటర్ విద్యార్థులతో రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం పెట్టడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వనస్థలిపురం ఏసీపి, హయత్ నగర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్, వనస్థలిపురం ట్రాఫిక్ ఇన్స్పెక్టర్, హయత్ నగర్ ఎస్ఐలు, వనస్థలిపురం ట్రాఫిక్ ఎస్ఐ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఎసిపి రోడ్డు భద్రత గురించి, రోడ్డు ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించడం జరిగినది.

# డాక్టర్ సముద్రాల రాములు USA ని సన్మానించిన గుడిపల్లి సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి



**జయభేరి, గుడిపల్లి :**

గుడిపల్లి గ్రామంలో పుట్టి పెరిగి గుడిపల్లిలో విద్యను అభ్యసించి అంచలంచలుగా ఎదుగుతూ అమెరికాలో డాక్టర్ గా స్థిరపడిన సముద్రాల రాములు డాక్టర్ ఇండియాకి విచ్చేసిన విషయం తెలుసుకున్న గుడిపల్లి గ్రామ సర్పంచ్ వారిని హైదరాబాదులో కలుసుకొని వారిని సన్మానించడం జరిగింది. గతంలో వారు అమెరికాలో ఉండి కూడా ఇండియాలో ఉన్న తన సొంత గ్రామం గుడిపల్లిలో చేసినటువంటి అభివృద్ధి పనులను దృష్టిలో ఉంచుకొని వారిని కలవడం జరిగిందని గ్రామ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి అన్నారు.



# టాలెంట్ టెస్టులో విద్యార్థులు చక్కని ప్రతిభ కనబరిచారు

**జయభేరి, తుర్కపల్లి, జనవరి 21 :**

టాలెంట్ టెస్ట్ లో విద్యార్థులు చక్కని ప్రతిభ కనపరిచారని, సమాజ నిర్మాణంలో సాంఘిక శాస్త్రానికి బోధించే ఉపాధ్యాయులకు ముఖ్యపాత్ర ఉందని ఎంఈఓ మంజూషా రాణి అన్నారు. బుధవారం సోషల్ ఫోరం జిల్లా ఆధ్వర్యంలో మండల స్థాయి సాంఘిక శాస్త్ర టాలెంట్ టెస్టును తుర్కపల్లి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించారు .ఈ సందర్భంగా విజేతలు తెలుగు మీడియం మొదటి బహుమతి అక్షర జెడ్పిహెచ్ఎస్ వీరారెడ్డిపల్లి, ద్వితీయ బహుమతి కార్తీక్ జెడ్పిహెచ్ఎస్ మాదాపూర్, తృతీయ బహుమతి లిఖిత్ కుమార్ జెడ్పిహెచ్ఎస్ వీరారెడ్డిపల్లి, ఇంగ్లీష్ మీడియం మొదటి బహుమతి శశాంక్ జెడ్పిహెచ్ఎస్ దత్తాయపల్లి, ద్వితీయ బహుమతి అరుణ్ జెడ్ పి హెచ్ ఎస్ మాదాపురం, తృతీయ బహుమతి మనిశ్వర్ జెడ్పి హెచ్ఎస్ దత్తాయిపల్లి లకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ మాట్లాడుతూ సాంఘిక శాస్త్ర అభ్యాసన భవిష్యత్తులో పోటీ పరీక్షలకు ఎంతో చక్కగా ఉపయోగపడుతుందని అన్నారు. ఈ టాలెంట్ టెస్ట్ ను మండలంలోని సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు సుజాత, ప్రమీల, మధుకర్, అశోక్, విజయ్ కుమార్, దశరథ, కవిత లు నిర్వహించారు. అనంతరం ఎంఈఓ ను సోషల్ ఫోరం తరపున సన్మానించారు.

# అర్హులందరికీ ఇందిరమ్మ చీరలు పంపిణీ

- కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య
- 19, 20, 21 వ వార్డులలో మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి చీరలను పంపిణీ



**జయభేరి, షాద్ నగర్, జనవరి 21 :**

అర్హులందరికీ ఇందిరమ్మ చీరలను పంపిణీ చేస్తున్నట్లు షాద్ నగర్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు కొంకళ్ల చెన్నయ్య అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని 19, 20, 21 వ వార్డులలో మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని అన్నారు. మహిళల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందని తెలిపారు. మహిళల ఆత్మగౌరవానికి ప్రతీక ఇందిరమ్మ చీరలని చెప్పారు. ప్రజా ప్రభుత్వంలో పేద ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని, దీనిలో భాగంగానే పేదలకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేయడం జరుగుతుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు ఇంచార్జ్ ఎం.డి షర్ఫుద్దీన్, 20వ వార్డు యువ నాయకులు నీరటి వాసు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# KTS క్రీడ మహోత్సవం



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ కృష్ణవేణి టాలెంట్ స్కూల్ లో యాన్యువల్ స్పోర్ట్స్ మీట్ కే టీ ఎస్ క్రీడ మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కుషన్ ఇన్ టాలెంట్ స్కూల్ బి శ్రీనివాస్ రెడ్డి, గౌరవ అతిథిగా రాఘవాచారి, పాఠశాల డైరెక్టర్ రాజ్ కుమార్ రెడ్డి జ్యోతి ప్రజ్వలంతో ఘనంగా ఆటలు పోటీలను ప్రారంభించినారు. ఇందులో భాగంగా విద్యార్థులు నృత్యాలు ఎంతగానో ఆకర్షించినాయి. ఈ సందర్భంగా సీఈఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల శారీరక దృఢత్వానికి మానసిక ఎదుగుదలకే కాకుండా విద్యార్థులలో ఉత్సవాన్ని ఉల్లాసాన్ని కలిగించడానికి చదువుతోపాటు ఈ ఆటల పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలియజేసినారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి నవీన్ గౌడ్, వైస్ ప్రిన్సిపాల్ అన్వర్ హుస్సేన్, అధ్యాపక బృందం విద్యార్థినీ విద్యార్థులు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పెన్షనర్స్ సేవాసదనం నిర్మాణ నిధికి విరాళం




**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ ప్రభుత్వం పెన్షనర్స్ సేవాసదనం మొదటి అంతస్తూ నిర్మాణం కొరకు S స్వర్ణలత రిటైర్డ్ టీచర్ ఈ రోజు తన వార్షిక లైఫ్ సర్టిఫికెట్ ఆన్లైన్లో సమర్పించుటకు సేవాదనమునకు వెంచేసినారు. భవన నిర్మాణం చూసి ఆనందంతో గతంలో రూ. 5,000 అందజేసినారు. తిరిగి ఈ రోజు రూ. 5,116లు మొత్తం రూ 10,116 కార్యదర్శి అంకం చంద్రమౌళికి అందజేసినారు. ఈ సందర్భంగా దాత మాట్లాడుతూ మా సంఘం భాద్యులు మాకు అన్నిరకాల సేవలను చేస్తూ, సమస్యలకు పరిస్కారాలు చూపెడుతున్నారు. మాకు చాలా సంతోషంగా వుంది అన్నారు. కార్యనిర్వాహక కార్యదర్శి మహమ్మద్ యూసుఫ్ షరీఫ్ మాట్లాడుతూ సభ్యులు సంఘం కొరకు అన్ని రకాలుగా సహకరిస్తున్నారు. వారికి కృతజ్ఞతలు తెలిపినారు.



# ప్రభాస్ స్పీడ్‌కు బ్రేకుల్లేవు..

## 'సలార్ 2' అప్‌డేట్‌పై అభిమానుల ఉత్కంఠ

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం కెరీర్‌లో అత్యంత వేగంగా దూసుకెళ్తున్న దశలో ఉన్నారు. ఒకదానికొకటి మించిన భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఆయన, సంక్రాంతి కానుకగా విడుదలైన 'ది రాజా సాబ్'తో మళ్లీ థియేటర్లలో సందడి చేశారు. ఈ సినిమాకు మిశ్రమ స్పందన వచ్చినప్పటికీ, బాక్సాఫీస్ వద్ద ప్రభాస్ క్రేజ్ ఏమాత్రం తగ్గలేదని ట్రేడ్ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. కథ, జానర్ ఎలా ఉన్నా ప్రభాస్ పేరు ఉంటే ఓపెనింగ్స్ ఖాయం అనే విషయం మరోసారి రుజువైంది. ఇదే ఊపుతో ఆయన రాబోయే సినిమాలు మరింత పెద్ద స్థాయిలో రికార్డులు సృష్టిస్తాయన్న అంచనాలు బలపడుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పుడు అభిమానుల దృష్టి మొత్తం 'సలార్: పార్ట్ 2 – శౌర్యాంగ పర్వం'పైనే నిలిచింది. 'సలార్: పార్ట్ 1 - సీజ్‌ఫైర్' సాధించిన ఘనవిజయం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. భారీ ఓపెనింగ్స్‌తో పాటు పాన్ ఇండియా స్థాయిలో వసూళ్లు రాబట్టిన ఈ సినిమా ప్రభాస్ మాస్ ఇమేజ్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. 'దేవ' పాత్రలో ఆయన చూపించిన ఇంటెన్సిటీ, యాక్షన్ ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంది. దీంతో కథకు కొనసాగింపుగా రాబోతున్న రెండో భాగంపై అంచనాలు అమాంతం పెరిగిపోయాయి. ఇటీవల సోషల్ మీడియాలో 'సలార్ 2' నుంచి గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 25, 2026న ఏదైనా స్పెషల్ అప్‌డేట్ లేదా గ్లింప్స్ విడుదలయ్యే అవకాశం ఉందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. హోంబలే ఫిలిమ్స్ నుంచి ఇప్పటివరకు అధికారిక ప్రకటన రాకపోయినా, ఈ వార్తలు అభిమానుల్లో ఉత్కంఠను పెంచాయి. మరోవైపు చిత్ర బృందం ప్రస్తుతం ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉండటంతో టీజర్ రిలీజ్‌పై భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. అయినప్పటికీ ఆ రోజున చిన్న అప్‌డేట్ వచ్చినా సరే, అది నెట్టింట పెద్ద ఎత్తున ట్రెండ్ అవుతుందన్న నమ్మకం అభిమానుల్లో ఉంది. కథ పరంగా 'సలార్ 2'లో ఖాన్సార్ సింహాసనం కోసం జరిగే రక్తపాత పోరాటమే ప్రధాన ఆకర్షణగా ఉండనుంది. మొదటి భాగంలో స్నేహబంధంతో కనిపించిన దేవ మరియు వరద రాజ మన్నార్ పాత్రలు రెండో భాగంలో శత్రుత్వంగా ఎలా మారతాయన్నది కథకు కీలకం. దేవ 'శౌర్యాంగ' వంశానికి చెందినవాడన్న ట్విస్ట్‌తో ముగిసిన పార్ట్ 1, పార్ట్ 2లో భారీ యాక్షన్ ఎపిసోడ్స్‌కు దారితీయనుందని సమాచారం. దర్శకుడు ప్రశాంత్ నీల్ ఈ సీక్వెల్‌ను మొదటి భాగాన్ని మించే స్కేల్‌తో, మరింత గ్రాండ్‌గా తెరకెక్కించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారని టాక్. ఈ సినిమా షూటింగ్ 2026 మధ్యలో ప్రారంభమయ్యే అవకాశాలున్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి.

# ఈ ఏడాదంతా బిజీ!



అగ్ర కథానాయకుడు వెంకటేష్‌కు సంక్రాంతి సీజన్ బాగా కలిసొచ్చింది. గత ఏడాది 'సంక్రాంతికి వస్తున్నాం'తో బ్లాక్‌బస్టర్ హిట్‌ను ఖాతాలో వేసుకున్నారు. తాజాగా 'మనశంకర వరప్రసాద్‌గారు' చిత్రంలో వెంకీగౌడగా అతిథి పాత్రలో అదరగొట్టారాయన. ప్రస్తుతం వెంకటేష్ సక్సెస్‌ట్రాక్‌లో దూసుకుపోతూ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. ఈ ఏడాది ఆయన కాల్షీట్స్ మొత్తం ఫుల్ అయిపోయాయి. ప్రస్తుతం త్రివిక్రమ్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం' చిత్రీకరణ జరుగుతున్నది. ఈ సినిమాపై ఇప్పటికే భారీ హైప్ క్రియేట్ అయింది. ఇది పూర్తయ్యాక అనిల్ రావిపూడితో 'సంక్రాంతికి వస్తున్నాం' సీక్వెల్‌లో వెంకీ జాయిన్ అవుతారని టాక్ వినిపిస్తున్నది. తాజా సమాచారం ప్రకారం ఆయన లైనప్‌లో 'దృశ్యం3' కూడా చేరినట్లు సమాచారం. ఈ సినిమా తెలుగు వెర్షన్ ఆగిపోలేదని ఇటీవల నిర్మాత సురేష్‌బాబు క్లారిటీ ఇచ్చారు. అక్టోబర్‌లో 'దృశ్యం 3' పట్టాలెక్కుతుందని తెలిపారు. అదేగనుక నిజమైతే 'సంక్రాంతికి వస్తున్నాం' సీక్వెల్‌తో పాటు 'దృశ్యం3' చిత్రాలు సమాంతరంగా షూటింగ్‌ను జరుపుకుంటాయి. మొత్తానికి ఈ ఏడాది మూడు భారీ చిత్రాలతో బిజీబిజీగా గడుపబోతున్నారు విక్టరీ వెంకటేష్.



# ఫ్యూచర్‌లో పీఎం అయినా నేను ఆశ్చర్యపోను..

'పవన్ కల్యాణ్ ఎంతో మందికి దేవుడితో సమానం. ఆయనంటే అంత క్రేజ్ ఉంది. అలాంటి అభిమానం కొందరికి మాత్రమే సొంతమవుతుంది. ఆయన కూడా అభిమానులను అలానే చూసుకుంటారు. పవన్ సార్ తో కలిసి వర్క్ చేసేటప్పుడు నేను ప్రత్యక్షంగా చూశాను. కలిసిన అందరితో బాగా మాట్లాడతారు. 'హరిహర వీరమల్లు'కు వర్క్ చేసే సమయంలో చాలా మంది నా దగ్గరకు వచ్చి 'మీరు మా దేవుడితో వర్క్ చేస్తున్నారు' అని అనేవారు. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకోవచ్చు. ఎప్పుడూ పాజిటివ్‌గా ఉంటారు. దేనికోసమైనా వందశాతం కష్టపడతారు. ఎలాంటి విషయాన్నైనా ధైర్యంగా చెబుతారు. నిజాయతీగా ఉంటారు. అందుకే సినిమాలతో సంబంధం లేకుండా ప్రజలు ఆయన్ని ఇష్టపడతారు. భవిష్యత్తులో ఆయన ప్రధాని అయినా నేను ఆశ్చర్యపడను" అని నిధి అగర్వాల్ చెప్పుకొచ్చింది. కాగా హరి హర వీరమల్లు తర్వాత ప్రభాస్ తో కలిసి ది రాజాసాబ్ సినిమాలో కథానాయికగా నటించింది నిధి అగర్వాల్. సంక్రాంతి కానుకగా విడుదలైన ఈ సినిమా మిక్స్‌డ్ టాక్ తెచ్చుకుంది.



# ఏం మేకోవర్ భయ్యా..

ఆమె మరెవరో కాదు.. హీరోయిన్ ఎస్తర్ అనిల్. వెంకటేశ్, మీనా కలిసి నటించిన దృశ్యం సినిమాలో నటించింది. ఇందులో వెంకీ చిన్న కూతురిగా కనిపించింది. మలయాళంలో వచ్చిన దృశ్యం సినిమాతో ఫుల్ క్రేజ్ సొంతం చేసుకుంది ఈ అమ్మడు. రెండు తెలుగు భాగాల్లోనూ తనే నటించింది. ఆ తర్వాత పలు సినిమాల్లో నటించిన ఈ బ్యూటీ.. తర్వాత చదువుపై దృష్టి పెట్టింది. ఇటీవలే లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (LSE)లో గ్రాడ్యుయేషన్ కంప్లీట్ చేసింది. ఇందుకు సంబంధించిన ఫోటోస్ షేర్ చేయగా.. నెటిజన్స్ కంగ్రాట్స్ చెప్పారు. ఇప్పుడు తాజాగా లేటేస్ట్ ఫోటోషూట్ షేర్ చేసింది. బ్లాక్ డ్రెస్ లో సింపుల్ లుక్స్ తో ఎస్తేర్ షేర్ చేసిన ఫోటోస్ ఇప్పుడు నెట్టింట వైరలవుతున్నాయి. అందులో హీరోయిన్లకు మించిన అందంతో ఆశ్చర్యపరుస్తుంది. ఇప్పుడిప్పుడే సినిమాల్లోకి తిరిగి రీఎంట్రీ ఇస్తున్న ఎస్తేర్.. సరైన అవకాశం వెయిట్ చేస్తున్నట్లు తెలుస్తోంది. సినిమాలకు దూరంగా ఉంటున్నప్పటికీ సోషల్ మీడియాలో మాత్రం చాలా యాక్టివ్ గా ఉంటుంది. నిత్యం ఏదోక పోస్ట్ చేస్తూ నెటిజన్లను అలరిస్తుంది. కేరళకు చెందిన ఈ అమ్మడు.. చైల్డ్ ఆర్టిస్టుగానే ఎక్కువగా పాపులర్ అయ్యింది. జోహార్, దృశ్యం సినిమాలు ఆమెకు పేరు తెచ్చిపెట్టాయి.

# తెలంగాణ సాయుధ పోరాటంలో 'గొల్ల రామవ్వ'..




దివంగత భారత మాజీ ప్రధాని, భారత రత్న పీవీ నరసింహారావు రాసిన కథల్లో ఒకటి గొల్ల రామవ్వ. తెలంగాణ సాయుధ పోరాట గాథ నేపథ్యంలో సాగే ఈ స్టోరీ సిల్వర్ స్క్రీన్‌పైకి రాబోతుంది. పాపులర్ రైటర్, ప్రొడ్యూసర్, దివంగత ముళ్లపూడి వెంకటరమణ కుమారుడు వర ముళ్లపూడి దర్శకత్వం వహిస్తున్నాడు.

భయం పోయినప్పుడు ధైర్యం మొదలవుతుంది.. ప్రతిఘటన, ఆశ చుట్టూ తిరిగే శక్తివంతమైన కథ.. అంటూ తెరకెక్కుతున్న ఈ ప్రాజెక్ట్ పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం ఈటీవీ విన్‌లో ఈ నెల 25 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, హిందీ, మలయాళం, ఒడియా భాషల్లో సూపర్ పాపులారిటీ సంపాదించుకున్న తళ్లూరి రామేశ్వరి ఈ చిత్రంలో టైటిల్ రోల్ పోషిస్తుండటంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. రజాకార్ల దాష్టికానికి తెలంగాణ ప్రాంతం వణికిపోతున్న కాలంలో ఓ పల్లెలో జరిగే కథ ఇది. కథాసుధలో భాగంగా 30 నిమిషాల రన్‌టైంతో సాగే ఈ ప్రాజెక్ట్ సాయుధ పోరాట యోధుడిని రక్షించడంలో గొల్ల రామవ్వ ఎలాంటి త్యాగానికి సిద్ధపడిందనే నేపథ్యంలో సాగనుంది. ఈ ప్రాజెక్టుకు సాయి మధుకర్ సంగీతం అందిస్తుండగా.. అజహర్ షేక్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నాడు.

Printed and Published, Editor & Owned by **MOTHE RAGHU THIRUPATHI REDDY**, Printed at Hamara Warangal Printers and Graphics, # 25-8-182, Babuji Nagar, Kazipet, Warangal, Telangana - 506003.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500 039. **Cell: 9391 544 889. PRGI No: TGTEL/25/A0314.** email: **jayabherinews@gmail.com, www.jayabheridaily.com**